Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 20.10.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 20 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# ప్రజాస్వామ్యానికి పాతర!

➤ ప్రజల మనసులు గెలవడంకంటే ప్రజాప్రతినిధులను కొనడం సులభమైంది?

➤ రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని బలహీన పరచడానికి దగ్గరి దారి ఎంచుకున్న చంద్రబాబు!

నేను పార్టీ మారేది లేదు... పార్టీ మార్చాల్సిన అవసరమే ముంది... మమ్మల్ని ప్రజలు ఒక పార్టీ తరపున ఓట్లేసి గెలిపించారు, ఇప్పుడు అధికారంలో లేమని చెప్పి ఇంకో పార్టీలోకి వెళితే... మేం ప్రజలకు ఏం మెసేజ్ ఇచ్చినట్లు... పార్టీ మారకముందు ఎంపీలు, ఎమ్మెల్యేలు చెప్పిన మాటలు ఇవి.

మరి పార్టీ మారాక... మా నియోజకవర్గం అభివృద్ధి మాకు ముఖ్యం. అధికారపార్టీలో వుంటేనే ప్రజలకు నాలుగు పనులు చేయగలం. ఈ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు మెచ్చే మా కార్యకర్తలతో చర్చించి ఈ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నాం. కేవలం అభివృద్ధి కోసమే పార్టీ మారాం.

మొన్నటి భూమా అఖిలప్రియ నుండి నేటి బుట్టా రేణుక వరకు ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మారిన ప్రతి వైకాపా ఎంపీ, ఎమ్మెల్యే చెప్పిన మాటలే ఇవి. పార్టీ మారక ముందు ఓ మాట... పార్టీ మార్చాక ఇంకో మాట. అసలు వీళ్లకు అలా మాట్లాడడానికి మనసు ఎలా వస్తుందో కూడా అర్థం కాదు. రాజకీయ నాయకులకు రెండు నాల్కలు ఉంటాయన్నది వీళ్లను చూసేనేమో! ప్రతిపక్షంలో వుంటే అభివృద్ధి చేయలేం... అధికార పార్టీలో వుంటేనే అభివృద్ధి

(మిగతా 11వ పేజీలో)



# చదువా? చావా?

✱ నేలరాలుతున్న సరస్వతీ పుత్రులు

✱ వయసును మించిన ఒత్తిడితోనే బలవన్మరణాలు

✱ ఈ మరణశాసనాలకు అమ్మానాన్నలూ కారకులేనా..?

ర్యాంకులు... మార్కులు...
ఉరుకులు... పరుగులు...
10గంటల పాటు క్లాసులు..
8గంటల పాటు స్టడీ అవర్స్.
ఫ్యాక్టరీలో యంత్రానికి...
కాలేజీలో విద్యార్థికి తేడానే లేదు.

(మిగతా 11వ పేజీలో)






## ఆ ఆరు జిల్లాల్లో...

# అగ్నిపరీక్షే

● కృష్ణా దాటాక జగన్‌కు కష్టాలే!



విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 13జిల్లాలే మిగిలాయి. కోస్తాలో 9, రాయలసీమలో 4 జిల్లాలున్నాయి. మెజార్టీ జిల్లాల్లో ఏ పార్టీకైతే రాజకీయంగా బలమైన పునాదులు ఉన్నాయో ఆ పార్టీకే విజయావకాశాలు మెరుగ్గా వుంటాయి. కోస్తా, రాయలసీమ అన్నవి పక్కన పెడితే కృష్ణానదికి ఇవతల 7 జిల్లాలు, అవతల ఆరు జిల్లాలున్నాయి. కృష్ణా నదికి అవతలి వైపు వున్న జిల్లాల్లోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అగ్ని పరీక్ష ఎదురవుతోంది.

కృష్ణానదికి ఇవతల జిల్లాలైన కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో వైసిపి బలంగానే వుంది. ఒక్క అనంతపురం జిల్లాలో బలం పుంజుకోవాల్సి వుంది. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి వచ్చిన సీట్లలో సింహభాగం ఇక్కడివే! ఈ జిల్లాల్లో వున్నంత

(మిగతా 11వ పేజీలో)

# విషజ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్‌కు తిరుపతి ఎంపి వినతిపత్రం**

నెల్లూరుజిల్లాలో విషజ్వరాలు ప్రబలకుండా ప్రత్యేకచర్యలు చేపట్టాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజుకు తిరుపతి ఎంపి వరప్రసాదరావు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 16వ తేదీన ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముత్యాలరాజుని కలసి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అనేక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చిట్టమూరు మండలం కొక్కుపాళెంలో డెంగ్యూ, విషజ్వరాలతో 7మంది, మనుబోలు మండలం కాగితాలపూడిలో ముగ్గురు మృతి చెందారన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. చేనేత వృత్తిదారుల్లో 6 ఉపకులస్తులకు 610 జి.ఓ ప్రకారం ఒక్కొక్క కుల అసోసియేషన్ సభ్యులను టాస్క్‌ఫోర్స్ కమిటిలో నియమించాలన్నారు. పద్మశాలి కులస్తులకు కమ్యూనిటి భవనం నిర్మించాలని కోరారు. రజకుల్లో చేతవృత్తి చేసుకుని జీవించే వారిలో 50ఏళ్ళు దాటినవారికి నెలకు రూ.2వేలు పింఛన్ మంజూరు చేయాలన్నారు. నగరంలో అద్దె ఇళ్లలో నివాసం ఉండే వారు ఎవరైనా మరణిస్తే అలాంటి వారి కోసం నగరంలో శవ ఆశ్రయగృహం నిర్మించాలని కోరారు. ముత్తుకూరు దళితవాడల్లో మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్లు నిర్మించేందుకు ఎంపి లాడ్స్ నుంచి రూ.4లక్షలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జడ్పీ వాకర్స్ ఉచిత వైద్య శిబిరం



నెల్లూరులోని జడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ పొదలకూరు రోడ్డులోని జడ్పీ హై స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బిపి, నేత్ర, దంత, చర్మ వ్యాధులకు సంబంధించిన వ్యాధిగ్రస్తులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. సింహపురి హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో దాదాపు 300మంది పాల్గొన్నారు. డాక్టర్లు గోపి, వాత్సవ, వెంకటేష్, కృష్ణమూర్తి, దినకర్, వెంకటేశ్వర్లు పాల్గొని రోగులను పరీక్షించి తగు సూచనలు, మందులు ఇచ్చారు. సంస్థ అధ్యక్షులు చలంచర్ల భాస్కరరెడ్డి, ఇంటర్నేషనల్ ఛైర్‌పర్సన్ మండువ శ్రీనివాసరావు, జెయస్‌ఆర్ ఆంజనేయులు, నలుబోలు బలరామయ్యనాయుడు, యం.వి.నారాయణరెడ్డి, బిరుదవోలు రామిరెడ్డి, యం.వి.సుబ్బారెడ్డి, మైథిలి మనోహర్‌రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

# పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు ఆర్టీసీ డిపో-1 నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎం.వి.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 16వ తేదీన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరరామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరరామం, సామర్లకోటలోని కొమరా రామానికి ఈ నెల 22, 29, నవంబర్ 5, 12 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. సూపర్ లగ్జరీకి ఒక్కొక్కరికి రూ.1750, అల్ట్రా డీలక్స్‌కు రూ.1650, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1350, పల్లె వెలుగుకు రూ.950 ఛార్జీలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణీకులకు పసుపు, కుంకుమ, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ ఉచితంగా అందిస్తామన్నారు. వివరాలకు 9959225653, 0861 - 2326312 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## కాలధర్మం

# పోలిరెడ్డి పెంచలరెడ్డి



ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఎంతోకాలం నుంచి పనిచేస్తూ, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా, భారతీయ కిసాన్ బ్యాంక్ రాష్ట్ర కన్వీనర్‌గా బహుముఖ సేవలందించిన పోలిరెడ్డి పెంచలరెడ్డి (67) ఈ నెల 12న పరమపదించారు. దైవభక్తి-దేశభక్తి కలిగిన ఆధ్యాత్మికవేత్తగా పెంచలరెడ్డి అందరికీ సుపరిచితులే. ఆయన స్వగ్రామం బుచ్చిరెడ్డిపాళెం పెనుబల్లి గ్రామం. 1951 జనవరి 14న ఆయన జన్మించారు. అందరికీ చేదోడువాదోడుగా ఉంటూ ఆధ్యాత్మిక - సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయన ఎల్లప్పుడూ ముందుండేవారు. నెల్లూరులోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో జరిగే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆయనే దగ్గరుండి నిర్వహించారు. నెల్లూరు నగర శ్రీకృష్ణచరిత మానస ప్రచారమండలి అధ్యక్షులుగా గత రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నారు. స్వగ్రామమైన పెనుబల్లిలోని శ్రీరామ మందిరంలోను, శివాలయంలోనూ వీరి సహకారంతో ఎన్నో విశిష్టపూజలు, ఉత్సవాలు జరిగేవి. వారు తనకెంతో ఇష్టమైన పాలకోవా తయారుచేయించి తన స్నేహితులందరికీ ఎంతో అభిమానంతో పంచుతూ ఉండేవారు కూడా. అలా చేయడం ఆయనకెంతో ఇష్టం. అంతేకాదు, గ్రామీణ ప్రజలకు పాడుపుపై మక్కువ కలిగేలా చేసి, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు ఎంతో కృషిచేశారు. మంచి సేవాభిలాషి, స్నేహాభిలాషి, ధార్మికవేత్త అయిన పెంచలరెడ్డి మృతి బాధాకరం. ఆయన మరణానికి చింతిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది.. లాయర్!

# తెలుగు మహిళ ప్రమాణస్వీకారం



ఈ నెల 14వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో తెలుగుదేశం జిల్లా మహిళా విభాగం కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలుగా ముప్పాళ్ళ విజేత, ప్రధాన కార్యదర్శులుగా పునబాక భూలక్ష్మి, అంచూరు జానకి, రజనిలతో పాటు ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూరాధ, సూళ్ళూరుపేట చెంగాళమ్మ దేవస్థానం ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు దేవరాల మస్తానమ్మ, బొల్లినేని శ్రీవిద్య, మేకల రజని, షేక్ వహీదా, కొమరగిరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

**విలువిద్యలో**

# వేదవ్యాస చిన్నారి ప్రతిభ



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న వేదవ్యాస స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న పి.యశస్విని జూనియర్ జాతీయ విలువిద్య పోటీలకు ఎంపికైంది. ఇటీవల విజయవాడలో రాష్ట్ర స్థాయిలో 9 సంవత్సరాల లోపు విభాగంలో జరిగిన విలువిద్య పోటీల్లో యశస్విని విజేతగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతైనా విశేషం. మన జిల్లా ఖ్యాతిని నిలిపేవిధంగా ఈ చిన్నారి ఎంతో నైపుణ్యంతో విలువిద్యలో రాణిస్తుండడం పట్ల స్కూలు నిర్వాహకులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ, ఆ చిన్నారిని అభినందించారు.

**అంతర్జాతీయ క్రిస్టియన్ సదస్సుకు**

# నెల్లూరీయులు



మలేషియాలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ క్రిస్టియన్ సదస్సుకు నెల్లూరుకు చెందిన ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు, నెల్లూరు యునైటెడ్ గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి రెవరెండ్ రాజశేఖర్ దాసరి ఈ నెల 16వ తేదీన బయలుదేరి వెళ్లారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సులో చర్చించనున్నట్లు వారు తెలిపారు.

# దీపాలతోనే దీపావళి



దీపావళి పండుగను పురస్కరించుకుని ఆ పర్వదినాన్ని టపాకాయలతో కాకుండా దీపాలతోనే జరుపుకోవాలని, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని దీపాల వెలుగులో దీపావళిని ఘనంగా జరుపుకోవాలని కోరుకుంటూ నెల్లూరు మాగుంట లేఅవుట్ మినీబైపాస్‌రోడ్‌లో ఉన్న నక్షత్ర స్కూల్ నిర్వాహకులు తమ చిన్నారులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు పచ్చదనాన్ని పరిరక్షించి పర్యావరణం కాపాడాలంటూ చిన్నారులకు మొక్కలను పంపిణీ చేశారు. నక్షత్ర స్కూల్ చిన్నారులు, యూరో కిడ్స్ స్కూల్ చిన్నారులు, అనేకమంది తల్లిదండ్రులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఆ స్కూల్‌లో నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. నక్షత్రస్కూల్ కరెస్పాండెంట్ నరేష్, డైరెక్టర్ సంధ్య, యూరోకిడ్స్ స్కూల్ కరెస్పాండెంట్ పవిత్ర, కార్పొరేటర్లు ధారా వంశీ, మేకల రజని తదితరులు పాల్గొన్నారు.

# పెరుగు దంపతులకు జీవితసాఫల్య పురస్కారం





ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీ, సితార హోటల్ సమావేశమందిరంలో, వరంగల్‌కు చెందిన సృజనలోకం, ఫిలిప్పీన్స్‌కు చెందిన పెంటసి-బి వరల్డ్ పొయట్రీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఇండియా వరల్డ్ పొయట్రీ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కవిదంపతులు పెరుగు రామకృష్ణ, పెరుగు సుజనారామం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిని పెంటాసి-బి కవిత్వ సంస్థ అధ్యక్షులు డా.పెన్‌పెన్ బుటాంగ్ సత్కరించి, జీవితసాఫల్య పురస్కారం అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ కవితోత్సవంలో కవితారంగం, సృజన రంగంలో విశేష కృషిచేసిన 20 మందికి జీవిత సాఫల్య పురస్కారం, పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈ విశేష పురస్కారం అందుకున్నందుకు ఈ కవి దంపతులను స్థానిక కవులు, రచయితలు అభినందించారు.

# 'నిర్విరామ కవిసమ్మేళనం'లో నెల్లూరు కవులు



అనంతపురంలో ఈనెల 14, 15 తేదీల్లో ఎంతో అద్వితీయంగా జరిగిన 'ప్రపంచ నిర్విరామ కవిసమ్మేళనం' కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన పలువురు పాల్గొని తమ అద్భుత కవితాప్రతిభతో కవితలు పఠించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆ రోజున ఈ రెండు రోజుల్లో మొత్తం 33 గంటలా, 34 నిమిషాల, 55 సెకన్లపాటు నిర్విరామంగా ఈ కవిసమ్మేళనం జరిగింది. ఆద్యంతం ఎంతో ఆసక్తిగా జరిగిన ఈ కవిసమ్మేళనంలో నెల్లూరుకు చెందిన కవులు మోపూరు పెంచలనరసింహం, గుండాల నరేంద్రబాబు, అవ్వారు శ్రీధరబాబు, మాటేటి రత్నప్రసాద్, ఇంద్రగంటి మధుసూదనరావు, నల్లు రమేష్, ప్రొ. మాల కొండయ్య, ముసులూరు నారాయణ, దుప్పటి రమేష్‌బాబు, అన్నెం శివకృష్ణ, జంధ్యం కోదండరామయ్యలతో పాటు, కవయిత్రులు గోవిందరాజుల సుభద్రాదేవి, తోట సులోచన, వి.లక్ష్మీభవాని, ఎం.విజయదుర్గలు పాల్గొని తమ కవితాగానం చేశారు. అనంతరం నిర్వాహకులు వీరందరినీ ఘనంగా సత్కరించారు.

# అవును... వాళ్ళిద్దరూ ఫోన్లు ఎత్తరు!



## మునిసిపల్ మంత్రి నారాయణ, కమిషనర్ ఢిల్లీరావులపై సర్వత్రా అసంతృప్తి



ఒకాయన మునిసిపల్ శాఖకు రాష్ట్రాధినేత. సాక్షాత్తూ ఆ శాఖకి మంత్రి. మరొకాయన నెల్లూరు మునిసిపల్ శాఖలో అత్యున్నత అధికారి. ఆశ్చర్యం కలిగే విధంగా వీళ్ళిద్దరిలో కామన్‌గా ఒకే గుణం వుండడంతో అది ఎవరికీ మింగుడుపడడం లేదు. మున్సిపల్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ ఎవరి ఫోన్లూ ఎత్తుకోరు. ముఖ్యమంత్రి లేదా ఆయన తనయుడు లోకేష్ మినహా తన కుటుంబసభ్యులెవరైనా ఫోన్ చేస్తే తప్ప ఇంకెవ్వరికీ బదులివ్వరనీ, తన సహచర మంత్రులు ఫోన్ చేసినా ఆయన ఫోన్ సమాధానమివ్వడని సాక్షాత్తూ మన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తే ఓ సందర్భంలో నారాయణ గురించి కామెంట్ చేయడం మనకు తెలిసిందే! ప్రజలకు అభివృద్ధి కావాలంటే తాను "సార్" ఫోన్ ఎత్తుకుంటే చాలు ప్రజలతో తనకేం పని అనుకునే తత్వం నారాయణది. అయితే ఆయన నేను ఎన్నికల బరిలో దిగబోతున్నాను, పోటీకి సిద్ధమౌతున్నాను అని ప్రకటించిన తరువాతన్నా కనీసం ఫోన్లకు జవాబిస్తాడనుకున్న వారి ఆశ నిరాశే అయిందని తెలుస్తోంది. ఆయన వ్యవహారశైలిలో ఏ మార్పూ రాలేదని తెలుస్తోంది. ఆయన ఫోనెత్తే ప్రసక్తే లేదని ఆయన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలే బహిరంగంగా విమర్శించడం విడ్డూరం.

అయితే స్టేట్ బాస్‌ని, లోకల్ బాస్ ఫాలో అవుతున్నట్లుంది. నగర కమిషనర్ ఢిల్లీ రావు కూడా రాష్ట్ర స్థాయి అధికారులు లేదా తన "బాస్" చేస్తే తప్ప ఫోన్ జవాబివ్వడం లేదని సామాన్యుడు సైతం విమర్శిస్తున్నాడు. ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజా సమస్యలను తీర్చే నిఖార్సైన అధికారి వచ్చాడని అందరూ భావిస్తున్న తరుణంలో మన మునిసిపల్ కమిషనర్ ఈ అపవాదును మూటకట్టుకోవడం బాధాకరం.

జిల్లాకొచ్చిన ప్రతిభావంతులైన అధికారులెవరైనా ముందుగా ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ప్రజలకు ఏ సమస్య వున్నా తన దృష్టికి తేవాలని అవసరమైతే అర్ధరాత్రైనా తన ఫోన్ నెంబర్‌కి కాల్ చేయాలని చెప్తారు. ప్రజలు ఇచ్చే పన్నులతో జీతాలు తీసుకునే వీరు, ప్రజల సేవకు తమ సమయాన్ని కేటాయించాలి. కాని ప్రస్తుతం ఈ అధికారి వింత పోకడ చూస్తే విచిత్రంగా వుంది. ఇటీవల జిల్లాలో చాలా మంచిపేరున్న ఓ మాజీశాసనసభ్యుడు పదేపదే ఫోన్ చేస్తే కూడా ఈ కమిషనర్ స్పందించలేదని తెలిసింది. చివరకు ఆ మాజీశాసనసభ్యుడు తనకున్న సమస్యను లేఖ ద్వారా తెలిపినా, ఆ లేఖకు కూడా కనీస సమాధానం ఇవ్వలేనంత బిజీగా ఈ కమిషనర్ వున్నట్లుందని ఆయన బాధపడ్డాడు. పన్నులు చెల్లించే సామాన్య ప్రజలంటే లెక్క లేకపోయినా కనీసం ప్రజల సమస్యలకు నాయకత్వం వహించి ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా నిలిచే ప్రజాప్రతినిధుల ఫోన్లన్నా ఈ సారు గారు ఎత్తుకుని స్పందిస్తే బాగుంటుందని అధికార పార్టీ నేతలే గొణుక్కోవడం చూస్తే ఈయనపై ఎంత అసంతృప్తి వుందో అర్ధమౌతుంది. నగర కమిషనర్‌గా నెల్లూరుకు వచ్చిన రోజు నుండి బాగా పని చేస్తున్నాడన్న పేరును ఈయన సంపాదించుకున్నాడు. ముఖ్యంగా క్లీన్ & గ్రీన్‌కి ప్రాధాన్యతనిచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో ఫలితం సాధిస్తున్నాడన్న పేరు కూడా వుంది. మరి ఈ ఫోన్లెత్తుకోవడం లేదన్న అపవాదును ఎందుకు మూటకట్టుకున్నాడో ఆయనకే అర్ధం కావాలి. కమిషనర్ గారూ! మీకు మంచి పేరుంది సార్... ఈ ఒక్క విషయంలో మారితే ఇంకా మంచి పేరొస్తుందని ప్రజాభిప్రాయం.

# అమెరికాలో చంద్రమోహన్‌రెడ్డి బిజీ..బిజీ



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అమెరికా వెళ్లారు. అక్కడ వ్యవసాయ సంబంధమైన కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీబిజీగా ఉన్నారు. అమెరికాలోని లోవా రాష్ట్రంలో అక్కడి వ్యవసాయమంత్రి మిస్టర్ బిల్ నార్తీ, మరియు డిప్యూటి సెక్రటరీ మైఖేల్ నేగ్‌లను కలుసుకుని వారితో సంప్రదింపులు జరిపారు. వ్యవసాయాభివృద్ధికి ఎలాంటి విధానాలు అవలంభిస్తే బావుంటుందో అక్కడి అధికారులతో చర్చించారు. మెగా సీడ్ పార్కులను పటిష్టవంతంగా నిర్వహించే విషయమై కూడా చర్చలు జరిపారు. ఈ పర్యటనలో మంత్రి సోమిరెడ్డి వెంట వ్యవసాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వి.సి దామోదరనాయుడు, గ్లోబల్ ప్రోగ్రామ్ లీడర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



# క్యూ కట్టిన అగ్రి బాధితులు



నెల్లూరు పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రిగోల్డ్ బాధితుల నమోదు కేంద్రాల వద్దకు బాధితులు పోటెత్తినట్లు వస్తున్నారు. పోలీస్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన శిబిరాలలో కూర్చుని టోకెన్ల ప్రకారం కౌంటర్‌ల వద్దకు వెళ్ళి తమ వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని సిఐడి వారికి సహకరించడానికి తమ సిబ్బందిని కేటాయించారు. ఎండల్లో పడి వచ్చిన బాధితులకు మంచినీళ్ళు, మజ్జిగ వంటివి అందిస్తున్నారు. ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీ శ్రీనివాసులు నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. దీపావళి రోజు సెలవు దినం కావడంతో ఆరోజు బాధితుల వివరాలు నమోదు చేయలేదు.

## • ఆస్కాలో...

# ఆనందం... ఆహారం... ఆహ్లాదం



### ... ఇవే ఆయన ఆశయాలు!

### - ఎన్నికల బరిలో 'కెన్సస్' నరసారెడ్డి




"ఆస్కా" అంటే "ఆంధ్రా సోషల్ కల్చరల్ అసోసియేషన్". కానీ, ఈ పేరు చాలా తక్కువ మందికి తెలుసు. చెన్నై నగరానికి వెళ్ళే వారికి "ఆంధ్రా క్లబ్" అంటే తెలిసినంతగా "ఆస్కా" అంటే తెలియకపోవచ్చు.

తెలుగువారి కోసం 1952లో 65 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ ఓ ఆతిథ్య సముదాయం, ఆనంద ప్రాంగణం, ఆహ్లాద ప్రదేశం ఈ ఆంధ్రా క్లబ్. ఈ ప్రాంగణంలో అడుగుపెడితే మనం తమిళనాట ఉన్నామన్న ధ్యాసే ఉండదు. ఎక్కడో ఆంధ్రాలో మనోళ్ళ మధ్యలో మనూర్లోనే వున్నామన్న భావన కలుగుతుంది. ఇక్కడ అంతా తెలుగుదనమే, అందరూ తెలుగోళ్ళే, అన్నీ తెలుగు రుచులే.

ఈ ఆరున్నర దశాబ్దాల కాలంగా "ఆస్కా" సభ్యుల సంఖ్యతో పాటుగా క్లబ్బు ప్రాధాన్యత కూడా బాగా పెరిగింది. ఎప్పటికప్పుడు మారుతున్న కాలంతో పాటు క్లబ్బును ఆధునీకరిస్తూ సభ్యులను సంతృప్తి పరచడంలో ఇప్పటివరకూ పనిచేసిన కమిటీలో వారి వారి స్థాయిలో దోహదపడ్డారు.

2007 నుండి 2011 వరకు నెల్లూరీయుడైన కొండ్లపూడి నరసారెడ్డి అధ్యక్షుడిగా పరిపాలించిన కమిటి అప్పట్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి క్లబ్బు ప్రగతికి దోహదపడిందన్నది నిర్వివాదమైన అంశం. కెన్సస్ నరసారెడ్డిగా ప్రాముఖ్యత పొందిన నరసారెడ్డి తనకున్న గ్రూప్ ఆఫ్ హోటల్స్ ద్వారా పొందిన అపార అనుభవంతో సభ్యులకు అత్యంత అవసరమైన ముఖ్య విభాగాలలో దృష్టి సారించి క్లబ్బు ఆధ్వర్యంలో నడిచే గదులను ఆధునీకరించడం, అలాగే రెస్టారెంట్లలో రుచికరమైన ఆహారం అందుబాటులోకి తేవడం, దూరప్రాంతాల నుండి వచ్చి విశ్రాంతి కోసం, వినోదం కోసం క్లబ్బుకు వచ్చి వుండే వారికి అవసరమైన వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పాటు జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలను ఆధునీకరించడమే కాకుండా మంచి కుటుంబ వేడుకలకు వేదికలుగా వుండే విధంగా గోదావరి, కృష్ణా, కావేరి, పెన్నాల పేర్లతో సమావేశ మందిరాలను ఏర్పాటు చేసి ఈ క్లబ్బు ప్రాంగణానికి చక్కని కుటుంబ వేడుకల వేదికగా పేరు తెచ్చారు.

ఆతిథ్య రంగంలో అతిథులకు కావలసిన సౌకర్యాలను వారి అభిరుచులకు అనుగుణంగా అందించడంలో అనుభవం వుండడంతో ఆ అనుభవాన్నంతా జోడించి "ఆస్కా" అభివృద్ధికి నరసారెడ్డి వేసిన బాటలు అధ్యక్షపదవి నుండి ఆయన తొలిగిపోయినా ఆయన కృషికి చిహ్నాలుగా మిగిలిపోయాయి.

దాదాపు 6 సంవత్సరాల అనంతరం మళ్ళీ "ఆస్కా" అధ్యక్ష పదవి కోసం నరసారెడ్డి ఎన్నికల బరిలో దిగాడు. కుల కుమ్ములాటలతో, వర్గ పోరాటాలతో క్లబ్బు అభివృద్ధి క్షీణిస్తోందన్న ఆరోపణలు వస్తున్న దశలో తన టీంలో కార్యదర్శిగా రవి సాంబ శివరావు, కోశాధికారిగా బొమ్మిరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో పాటు ఇతర ఆత్మీయ సహచరులతో పోటీకి సిద్ధపడ్డాడు. గతంలో ఆయనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలే అని న్యాయస్థానాల ద్వారా రుజువు చేసుకుని ఆయన కడిగిన ముత్యంలా మళ్ళీ క్లబ్బు అభివృద్ధికి బద్ధుడై సభ్యుల ఆశీస్సులు కోరుతున్నాడు.

"ఆంధ్రా క్లబ్" అందరి క్లబ్బుగా మార్చాలన్న లక్ష్యంతో "తన గెలుపు – క్లబ్బు అభివృద్ధికి మలుపు" అనే నినాదంతో ముందుకొచ్చాడు. మన నెల్లూరీయుడు అందరికీ స్నేహపాత్రుడు, నిరాడంబరుడు, నిజాయితీ పరుడైన "నరసయ్య"ను గెలిపించడానికి నెల్లూరు సభ్యులంతా సంసిద్ధం కావాలని ఆయన అభిమానులు పిలుపునిస్తున్నారు.

## 'ప్రభా'తం

దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం గతంలో కంటే ఎంతోకొంత అభివృద్ధిని సాధిస్తున్నా, పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు ప్రజలకు మంచి పుష్టికరమైన ఆహారం మాత్రం కరువే అవుతోంది. వ్యవసాయంలో ఇబ్బడిముబ్బడిగా రకరకాల రసాయనాల వాడకం పెరిగిపోతుండడంతో..పంటలు ఏపుగా పెరుగుతున్నట్లు కనిపించినా, నాణ్యత మాత్రం తగ్గిపోయి.. అలాంటి ఆహారం తిన్నప్పటికీ నీరసమే మిగులుతోంది. ఇదొక సమస్య అయితే, పంటపొలాల్లో విచ్చలవిడిగా రసాయనాలు వాడుతున్నప్పుడు, అత్యంత విషపూరితమైన పురుగుమందులను పిచికారీ చేస్తున్న సందర్భాల్లో ఆ విషవాయువులు పీల్చి ఎంతోమంది రైతులు తమ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఇదింకా బాధాకరం. ఆహార ఉత్పత్తులను పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు విషపూరిత రసాయనాల వల్లనో, కాలుష్యం వల్లనో, ప్రమాదకరమైన పురుగుమందుల వల్లనో వికటించకుండా ఎవరైనా ఎంతకాలం కనిపెట్టుకుని ఉండగలరు. అందువల్ల వాటిని దూరంగానే ఉంచాలి. మరో దుస్థితి ఏమంటే, దేశవ్యాప్తంగా ఉన్న పురుగుమందుల్లో దాదాపు సగం దాకా నకిలీవేనని మేధావుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అవి ప్రమాదమంటూ ప్రపంచదేశాలు నిషేధించిన అనేక రకాల పురుగుమందులను కూడా మనదేశంలో నిర్భయంగా వాడేస్తుండడం, తెలిసో తెలియకో.. మరోదారి లేకో వినియోగిస్తున్న ఈ మందుల వల్ల అనారోగ్యాల పాలుకావడం రైతులకు సర్వసాధారణమైపోతోంది. అటు ఉత్పత్తుల్లో నాణ్యతను క్షీణింపజేయడమే కాక, రకరకాల అనారోగ్యాలకు కూడా కారణమవుతున్న రసాయనాలు, కల్తీ పురుగుమందులను దేశంలో పూర్తిస్థాయిలో నివారించుకోలేకపోవడం..విచారకరం. అయితే, కేంద్రప్రభుత్వం ఇటీవల ఇలాంటి ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని, ఎప్పుడో పాతకాలం నుంచి ఉన్న రసాయనాలు పురుగుమందుల నియంత్రణకు సంబంధించిన నియమావళిని సరిదిద్దే ప్రయత్నం చేయడం హర్షదాయకమే అయినా, అదింకా ఆచరణలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. కల్తీవ్యాపారాల్లో.. ఇంకా పాతవాసనలు పూర్తిగా సమసిపోవడం లేదు. అయితే, క్రిమిసంహారక మందులను ఎవరిష్టం వచ్చినట్లు వారు వాడుకుంటూపోతే, గాలిలో కలిసిన ఆ మందుల వల్ల ఆరోగ్యాలకు నష్టం వాటిల్లుతుంది. పర్యావరణం కూడా క్షీణిస్తుంది. ఇప్పటికే రకరకాల కాలుష్యాలతో పర్యావరణం దెబ్బతింటోంది. విషతుల్యమైన పురుగు మందుల వినియోగం విపరీతంగా ఉండడం వల్ల అటు ప్రజలకు, ఇటు పర్యావరణానికి కూడా మరింత హాని కలుగుతోంది. అంతేకాదు, అత్యధిక రసాయనాల వాడకం వల్ల మన ఉత్పత్తులు విదేశాల నుంచి తిరుగు టపాలో తిరిగివస్తుండడాన్ని గుర్తుంచుకోవాలి. ఏటా దేశంలో వేలు, లక్షలాది టన్నుల క్రిమిసంహారక మందులు వాడుతూనే ఉన్నామంటే ఎంత భారీగా పురుగుమందులు, రసాయనాలు గాల్లో కలుస్తున్నాయో, తద్వారా మరెందరి ప్రాణాలు గాల్లో కలుపుకుంటున్నాయో ఊహించుకోవాల్సిందే. రసాయన ఎరువుల వాడకం వల్ల సాగయ్యే ఆహారపదార్థాలు తమ సహజమైన రుచిని కూడా కోల్పోతున్నాయి. కల్తీ మందులతో, కల్తీ ఎరువు లతో సాగులోకి వచ్చే పంటలు.. ఆరోగ్యపరంగా రైతులను కృంగదీయడమే కాక, ప్రజలను కూడా అనారోగ్యానికి చేరువ చేస్తూనే ఉన్నాయి. మనదేశంలో నిత్యం ఎంతోమంది బాలలు తినే ఆహారంలో పౌష్టికాహారం లోపించిపోవడం వల్లనే వారు బలహీనంగా ఉంటున్నారని, దేశంలో సుమారు 47 శాతం మంది బాలలు ఉండాల్సిన బరువుకంటే తక్కువ బరువు కలిగివున్నారని, పౌష్టికాహార లోపమే దీనికి కారణమని, బాలల మరణాల్లో అత్యధికశాతం మరణాలు కూడా పౌష్టికాహార లోపం వల్లనేనని యునిసెఫ్ ఒక అధ్యయనంలో స్పష్టం చేస్తోంది.

ఇదిలావుంటే, మరోవైపు మనదేశంలో ప్రజల ఆహారపు అలవాట్లు కూడా రానురాను బాగా మారిపోతున్నాయి. గతంలో లేని ఎన్నో రకాల ఆహారపదార్థాలు వంటల్లోకి వచ్చి చేరుతున్నాయి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పుష్టికరమైన ఆహారంగా పేరున్న సజ్జలు, జొన్నలు, రాగులు వంటివన్నీ మూలకుపోయి, నైస్‌గా ఉండే న్యూడుల్స్, కేక్‌లు, పిజ్జాలు వంటివి మన శరీరంలోకి బాగా చేరిపోతున్నాయి. తద్వారా వంట్లో బలవర్ధక పదార్థాలు లేకపోగా, బలాన్ని కుంగదీసే పదార్థాలనే ప్రీతిగా వాడుకోవడం వల రకరకాల అనారోగ్యాలు, స్థూలకాయం వంటి సమస్యలకు మన శరీరాలు పుట్టినిళ్ళుగా మారుతున్నాయి.

అటు వ్యవసాయరంగంలోనే కాక, పారిశ్రామిక రంగంలోనూ పొంచివున్న అన్ని రకాల రసాయన విపత్తులపై ప్రభుత్వాలు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి విపత్తుల ముప్పు తప్పించేందుకు పటిష్టమైన ప్రణాళికలను అమలు చేయాలి. ముఖ్యంగా, అటు రైతుల జీవితాలకు రక్షణ లేక, ఇటు ప్రజల ఆరోగ్యానికి భద్రత లేక, చేస్తున్న ఈ సేద్యమంతా దేనికోసమన్నది అందరూ ఆలోచించాలి. అన్నదాత జీవితాలు ఆనందమయం కావడానికి, దేశసౌభాగ్యానికి అవసరమైన అత్యుత్తమమైన నూతన విధానాలను వ్యవసాయరంగంలో విరివిగా తీసుకువచ్చినప్పుడే ఇలాంటి ముప్పుల నుంచి..అనారోగ్య విపత్తుల నుంచి మనం బయటపడగలం.

ఇప్పటికైనా ప్రభుత్వాలు 'మంచి ఆహారం..మంచి ఆరోగ్యం' కనుక, పుష్టికరమైన ఆహారాన్ని అందరికీ చేరువయ్యేలా చూడాలి. రసాయనాల వాడకం పూర్తిగా తగ్గించి, కల్తీ ఎరువులు, కల్తీ పురుగుమందులను నివారించి, ఎవరికీ ఎలాంటి హానీ లేని సురక్షితమైన సేంద్రియ సేద్యాన్ని రైతాంగానికి అందుబాటులోకి తీసుకురావాలి. సురక్షిత సేద్యమే అందరికీ శ్రీరామరక్ష!.. కనుక, అటు రైతాంగం, ఇటు వ్యవసాయ శాస్త్రవేత్తలు... ప్రజలందరి సహకారంతో వ్యవసాయ రంగంలో వినూత్నమైన, విప్లవాత్మకమైన మంచి మార్పుకు ప్రభుత్వాలే నాంది పలకాలి. అప్పుడే అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు, ఇటు ప్రజలకూ అన్నివిధాలా భద్రత ఉంటుంది. దేశ సౌభాగ్యానికి కూడా తద్వారా ఓ మంచి మార్గం వేసినట్లుంటుంది.

# సురక్షిత సేద్యమే శ్రీరామరక్ష

**అటు కల్తీ మందులు, ఇటు రసాయన ఎరువులు ఆహారంలో నాణ్యతను దెబ్బతీస్తూ.. రకరకాల అనారోగ్యాలకు కారణమవు తున్నాయి. మరోవైపు ఆ విషతుల్యమైన రసాయనాలను వాడే క్రమంలో పలు సంఘటనల్లో రైతుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది కూడా. ప్రభుత్వాలు ఇకనైనా ఈ అనర్థాలను నివారించడానికి.. ఎవరికీ ఎలాంటి హానీ లేని సురక్షితమైన సేంద్రియ సేద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. సురక్షిత సేద్యమే అందరికీ శ్రీరామరక్ష!.. కనుక, ఆ మార్పుకు ప్రభుత్వాలే నాంది పలకాలి.**

## న్యాయవాది బిఎస్ రంగరాజన్‌కు సన్మానం

నెల్లూరులోని ప్రముఖ న్యాయవాది బి.ఎస్ రంగరాజన్ ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నెల్లూరు టివిఎస్ కల్యాణసదన్‌లో ఆదివారం ఆయన మిత్రులు, సహచరులు, శ్రేయోభిలాషులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పి.రామదండు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళి, బిజెపి జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, ఏబివిపి అఖిలభారత కార్యదర్శి లక్ష్మణ్, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డి.ఫణిరత్నం, పి.రోజారెడ్డి, టివిఎస్ కల్యాణ్‌సదన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పిఎస్ఆర్‌కె మూర్తి, కోడూరు సత్యనారాయణ, రాజేష్, బిజెపి నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య, విజయకుమార్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసిన ఇసుక గుంతలు

నెల్లూరుజిల్లా వింజమూరు మండలం కాటేపల్లి బీసీ కాలనీకి చెందిన చీపినాటి నరేష్(15), చీపినాటి వర్ధన్(13)లను ఇసుక గుంతలలో పడి ప్రాణాలు కోల్పోయారు. వీరిరువురు కాటేపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. రెండవ శనివారం పాఠశాలకు సెలవు కావడంతో గేదెలను తోలుకుని గంగదేవలం వాగు వద్దకు వెళ్ళారు. ఇటీవల వాగులోని ఇసుకను ట్రాక్టర్లతో తరలించడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ చేరి వాగు నిండు కుండలా ఉంది. సరదాగా వీరు ఈత కొట్టేందుకు దిగారు. తొలుత వాగులోకి దిగిన వర్ధన్, నరేష్ మునిగిపోయారు. వారి వెనుకవస్తున్న స్నేహితుడు వంశీ, వారు కనిపించకపోవడంతో భయపడి గట్టుపైన నరేష్ చొక్కాలోని సెల్‌ఫోన్ సాయంతో వంశీ తండ్రి నాగేంద్రకు ఫోన్ చేసాడు. నాగేంద్ర అక్కడకు చేరుకుని నీటిలో మునిగిపోయిన నరేష్, వర్ధన్‌ను గట్టుకు చేర్చాడు. అప్పటికే వారు మృతి చెందారు. మృతదేహాలను గ్రామానికి తీసుకురాగా ఒక్కసారిగా మృతుల తల్లిదండ్రులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. కలిగిరి సిఐ కరుణాకరరావు, వింజమూరు ఎస్సై జిలానీబాషా మృతదేహాలను పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## హిందూ పండుగలప్పుడే గుర్తొస్తాయా?

మన మేధావులు, లౌకిక వాదులకు దీపావళి పండుగప్పుడు కాల్చుకునే టపాసుల వల్లే వాతావరణ కాలుష్యం కనిపిస్తుంది. కొత్త సంవత్సరం పేరుతో జనవరి 1వ తేదీ తగలేసే బాణాసంచా కనిపించదు. హిందూ జాతరలలో జంతు బలులే జీవహింసగా కనిపిస్తాయి, బక్రీద్ రోజున తెగిపడే లక్షల ఆవులు కనిపించవు. హిందువుల పండుగలన్నీ కూడా ప్రకృతితో, కాలాలతో ముడిపడి ఉంటాయి. ఒక్కో పండుగకు ఒక్కో విశిష్టత ఉంటుంది. రాజకీయ నాయకుల విగ్రహాలకు పాలాభిషేకాలు చేస్తున్నప్పుడు ఈ మేధావులు నోర్లు మెదపరు. దేవుడికి జరిగే పాలాభిషేకాలను విమర్శిస్తుంటారు. దేశంలో ఏ ఇతర ప్రార్థనా మందిరాలలో లేని విధంగా పేదలకు, భక్తులకు నిత్యాన్నదానాలు, ఇతర సేవా కార్యక్రమాలు హిందూ దేవాలయాలలో జరుగుతుంటాయి. వాటి గురించి ఎప్పుడైనా మంచి మనసుతో ఆలోచించారా?

**సి. రాజీవి, నెల్లూరు.**

## రచయిత ఏదైనా రాయొచ్చా?

కంచె ఐలయ్య వైశ్యులపై వ్రాసిన పుస్తకాన్ని నిషేధించడం కుదరదని, అది రచయిత భావప్రకటనా స్వేచ్ఛ క్రిందకు వస్తుందని సుప్రీం న్యాయమూర్తులు చెప్పారు. మరి ఎవరు ఏ కులాన్నయినా, ఏ మతాన్నయినా తిడుతూ పుస్తకాలు వ్రాసినా, వారి మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టకుండా ఉంటారా? ఒకరి మనోభావాలు ఒకరు గౌరవించుకుంటే కుల, మతాల అంతరాలు తగ్గుతాయి. ఇలా పుస్తకాలు వ్రాసి అగౌరపరచుకుంటుంటే కులాల మధ్య అంతరాలు పెరుగుతాయి. కులాలు, మతాలను లక్ష్యంగా చేసుకునే సాహిత్యాన్ని న్యాయమూర్తులు నిషేధించాలే గాని ఇలా రచయితలను ప్రోత్సహిస్తే అంతరాలు పెరుగుతాయి.

**శేగు సుబ్రహ్మణ్యం, నెల్లూరు.**




## నాశనం అయ్యింది

ప్రధాని నరేంద్రమోడీ అవలంభించిన కొత్త ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోంది. వ్యాపార, వాణిజ్య రంగాలు దారుణంగా దెబ్బతింటున్నాయి. పేటిఎం, రిలయన్స్, ఆదాని కంపెనీలకు ఆదాయం పెంచే విధంగా మోడీ ఆర్థిక విధానాలుంటున్నాయి. పి.వి.నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థను ఒక గాడిన పెడితే, మోడీ వచ్చి దానిని పట్టాలు తప్పించాడు

**- బి.కేశవ్, గుడ్లూరు.**

## మన బిడ్డలకు మనమే విషం ఇస్తామా?

ఇటీవల జరిగిన మద్యం దుకాణాల వేలం పాటలో మితిమీరిన పోటీతో చాలామంది పాల్గొన్న విషయం విన్నాం. కానీ ప్రతి వేలంపాటదారుడు చాలామంది బాగా మద్యం సేవించి ఆదాయం రావాలని ఆశించటం దురదృష్టకరం. మద్యం సేవించే వ్యక్తి మీ బిడ్డ లాంటి వాడేననే విషయాన్ని మర్చిపోతున్నారు. మీ షాపులో వేరేవాళ్ళు తాగి చెడిపోతుంటే మీ బిడ్డలు వేరే షాపులోకి వెళ్లి తాగుతారు అనే విషయాన్ని ప్రతి వేలంపాటదారు మరవరాదు. మీ బిడ్డలకు మీరే విషం ఇస్తారా? ప్రభుత్వానికి ప్రజలంతా బిడ్డలే. కానీ మన దురదృష్టం పాలకుల ప్రగల్భాలు నమ్ముతున్నాము.

ప్రజలపై పాలకులకు నిజమైన ప్రేమ వుంటే సమాజంలోని అక్రమాలకు మూలకారణమైన మద్యపాన నిషేధాన్ని దేశ మంతటా ఒకేసారి అమలు చేయాలి. ప్రజలకు కావలసింది జిఎస్‌టిలు కాదు, సక్రమమైన పాలన. మానవ శ్రేయోభిలాషులు స్పందించాలని మనవి.

**నలుబోలు రామ్మోహన్‌రెడ్డి, చెన్నై.**

# సీట్లకు సిగపట్లు తప్పవా...?

మొన్న నంద్యాల ఉపఎన్నికల్లో తెలుగుదేశం గెలిచిన ఎఫెక్ట్ బాగానే వుంది. జిల్లాలో ఆ పార్టీ సీట్లకు బాగానే పోటీ వుంది. నెల్లూరు నగరం, రూరల్ నుండే మంత్రి నారాయణతో పాటు మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకట స్వామినాయుడు, మాజీఎమ్మెల్యే ఆనం వివేకా తనయుడు ఏ.సి.సుబ్బారెడ్డి రంగంలో వున్నారు. ఇక నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆదాల ప్రభాకర్ రెడ్డి అటు పార్లమెంటుకు వెళతాడా లేక నెల్లూరు రూరల్ అడుగుతాడా? అన్నది అప్పటికిగాని తేలదు. ప్రస్తుతానికి ఆయన రూరల్‌లో తన పట్టును పెంచుకునే ప్రయత్నాలలో వున్నాడు. సర్వేపల్లి సీటుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డా లేక ఆయన కొడుకు రాజగోపాలరెడ్డా అన్నది అప్పటికి తేలే విషయమే! కోవూరు సీటుకు మాత్రం సిటింగ్ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు స్థానిక నాయకుడు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి కూడా పోటీ పడుతున్నాడు. 2014 ఎన్నికల్లో సీటు కోసం బలంగా ప్రయత్నించిన పెళ్ళకూరు ఈసారి ఆరునూరైనా పోటీ చేయాలనే పంతంతో వున్నాడు. వీళ్ళిద్దరు కాకుండా కోవూరుకు బి.సి వర్గాల నుండి ఏపిఐఐసి ఛైర్మెన్‌గా వ్యవహరిస్తున్న కృష్ణయ్య పేరు కూడా వినిపిస్తోంది. కావలి నుండి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు వున్నాడు. ఆయన పేరు లోక్‌సభకు కూడా ప్రతిపాదనలో వుంది. ఆయన కాకుంటే బీద రవిచంద్ర పేరు కూడా పరిశీలనలో వుంది. ఉదయగిరిలో సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు వ్యతిరేకత వుందని, ఈసారి ఆయనను మార్చాల్సిందేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక్కడ నుండి మాజీఎమ్మెల్యే, బలమైన వర్గం వున్న కంభం విజయరామిరెడ్డి టిక్కెట్ ఆశిస్తున్నాడు. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారి బొల్లినేని హజరత్తయ్య నాయుడు పేరు కూడా పరిశీలనలో వుంది. ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యామ్నాయం లేదు. వెంకటగిరి నుండి మాత్రం సిటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఈసారి సీటు ఇవ్వకపోవచ్చు ననే ప్రచారం జరుగుతోంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి వెంకటగిరి సీటు రేసులో వున్నట్లు తెలుస్తోంది. సిటింగ్ ఎమ్మెల్యే రామకృష్ణ పట్ల నియోజకవర్గంలో వ్యతిరేకత వుంది. వెంకటగిరిలో ఈసారి రెడ్డి సామాజికవర్గం నుండి అభ్యర్థి అయితేనే గట్టిపోటీలో నిలవగలడు. నియోజకవర్గంలో రాపూరు, కలువాయి, డక్కిలి, బాలాయపల్లి మండలాలలో 'రెడ్ల' ఆధిపత్యం వుంది. ఈ వర్గంలో చీలిక తేవాలంటే టీడీపీ అభ్యర్థి కూడా ఆ వర్గానికి చెందిన వాడై వుండాలనే అభిప్రాయం పార్టీలో వుంది. ఈ దృష్ట్యానే ఈసారి ఇక్కడ 'రెడ్ల'కే ప్రాధాన్యతనిచ్చే అవకాశముంది. సూళ్ళూరుపేటలో ఈసారి కూడా పరసా రత్నం సీటును ఆశిస్తున్నప్పటికీ ఈ నియోజకవర్గంలో మొదటి నుండి పార్టీ మంచి చెడ్డలు చూస్తున్న వేనాటి రామచంద్రారెడ్డి మాత్రం కొత్త అభ్యర్థిని తెరపైకి తెచ్చే ప్రయత్నాలలో వున్నాడు. ఇక గూడూరు నుండి మాత్రం వైకాపా నుండి జంప్ చేసి వచ్చిన సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన జ్యోత్స్నలతలు కడా పోటీపడే అవకాశముంది.



**నెల్లూరుజిల్లాలో ఉండేది ఒక లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు. వీటిలో రెండు ఎస్సీ రిజర్వుడ్. ఇక ఎవరు ఎంత తన్నుకున్నా మిగిలిన 8సీట్ల కోసమే తన్నుకోవాలి. అందులోనూ గత రెండు ఎలక్షన్ల నుండి వీటిలో ఒక సీటును బీసీలకు ఇవ్వడం సాంప్రదాయంగా వుంది. అలాగే బీజేపీతో పొత్తుంటే ఇంకో సీటు తగ్గుతుంది. కాబట్టి సీటుకు ఫైటు టైట్‌గానే వుండబోతోంది.**

## కావలి నాకే కావాలి

- రేసులో కాటంరెడ్డి
- తప్పుకోనంటున్న ప్రతాప్‌రెడ్డి





వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో సిటింగ్ ఎమ్మెల్యేలలో ఎక్కువ మందికి తిరిగి టిక్కెట్లిచ్చే అవకాశాలున్నాయి. అయితే ఒక్క కావలిలో మాత్రం సీటు విషయంలో బలమైన పోటీ నెలకొని వుంది. అది కూడా మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నుండే కావడంతో కావలి వైకాపా రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి.

ఈ జిల్లాలో వై.యస్.కు మొదటి రాజకీయ అనుచరుడు విష్ణు. అతని తర్వాతే ఆనం వాళ్ళయినా, ఇంకొకరైనా వై.యస్.ను అనుసరించారు. తనను నమ్మి తన వెంట నడిచినందుకు విష్ణును వై.యస్. అలాగే ఆదరించాడు. 2004 ఎన్నికల వరకు అతనికే అల్లూరు టిక్కెట్ వచ్చేలా చూసాడు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో అల్లూరు నియోజకవర్గం ఎగిరిపోయింది. దీంతో కావలి నుండి విష్ణు అయితే ఓడిపోతాడని తన సన్నిహిత రాజకీయ వర్గాలు చెప్పినా వై.యస్. వినిపించుకోకుండా ఓడిపోయినా ఫర్వాలేదు, నన్ను నమ్ముకున్నోళ్లను నేను వదిలేయలేను అంటూ కావలి సీటిచ్చాడు. ఆ ఎన్నికల్లో విష్ణు ఓడిపోవడం తెలిసిందే!

ఇక 2014 ఎన్నికల నాటికి రాష్ట్ర రాజకీయ స్వరూపం మారిపోవడం తెలిసిందే! కాంగ్రెస్ తెరమరుగు కావడంతో విష్ణు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఆ ఎన్నికల్లో కావలి సీటును ముందుగానే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఖరారు చేయడంతో విష్ణు అప్పుడు ఆ సీటుపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. సరికదా, వైసిపి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ గెలుపుకు చిత్తశుద్ధితోనే పనిచేసాడు.

కాని, ఈసారి ఎన్నికల్లో కావలి నుండి తానే స్వయంగా రంగంలోకి దిగాలని విష్ణు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డితోనూ చర్చించాడని, ఎమ్మెల్సీ ఇస్తాము, సిటింగ్ ఎమ్మెల్యేగా ప్రతాప్‌కే మద్దతునివ్వాలని జగన్ నచ్చజెప్పి చూసినా విష్ణు వినలేదని తెలుస్తోంది. ఈసారి ఎలక్షన్ బాగా ఖరీదవుతుంది. దానికి కూడా వెనక్కి తగ్గేది లేదని, ఆరు నూరైనా ఈసారి కావలి నుండి పోటీ చేసేది ఖాయమని విష్ణు తన వర్గీయులకు సంకేతాలు పంపుతున్నట్లు సమాచారం.



## కొనసాగుతున్న ప్రభాకర జలయజ్ఞం

- 6వ విడతగా పలు గ్రామాలలో వాటర్ ప్లాంట్‌ల ప్రారంభం

జిల్లా ప్రజానీకానికి సేవ చేయగలగడం తన అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖదాత, పారిశ్రామికవేత్త, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన విపిఆర్ అమృతధార కార్యక్రమంలో భాగంగా ఈనెల 15న 6వ విడతగా ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో విపిఆర్ పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పలు గ్రామాల్లో మంచినీటి వసతులు సక్రమంగా లేక ప్రజలు బాధలు పడుతున్నారని, కొన్ని గ్రామాల్లో ఫ్లోరైడ్, టిడిఎస్ వంటి నీటి సమస్యలతో అవస్థలు పడుతున్నారని, అలాంటి గ్రామాలను ఎంపిక చేసుకుని ఆ ప్రజలకు శుద్ధిచేసిన మంచినీటిని (మినరల్ వాటర్ ప్లాంట్‌లు) అందించడం విపిఆర్ ఫౌండేషన్‌కు లభించిన అపూర్వ అవకాశమని, దీనిని తాను తన అదృష్టంగా, ప్రజలకు సేవచేసే భాగ్యంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజల అభ్యర్థన, వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని, విపిఆర్ అమృతధార కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభించిందని, ఇదే స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా వాటర్‌ప్లాంట్‌లను నెలకొల్పడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆ తర్వాత, యువతనుద్దేశించి విపిఆర్ మాట్లాడుతూ, యువతను.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలనే అభిప్రాయంతో విపిఆర్ వికాస్ కార్యక్రమం చేపట్టామన్నారు. క్రీడల్లో వారు నైపుణ్యం పెంపొందించుకుని క్రీడా ప్రతిభతో రాణించాలని ఆకాంక్షిస్తూ వారికి క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు ఉచితంగా అందజేస్తూ ఎంతగానో సహకరిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రజలంతా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అమలవుతున్న ఈ కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. తొలుత విపిఆర్ అమృతధార ఆరవ విడత ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్ల, అనంతసాగరం, ఆత్మకూరు, సంగం మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయా గ్రామపెద్దల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని ఆయా గ్రామాల్లో ప్రజలు, స్థానిక ప్రముఖులు అందరూ ఎంతో ఘనంగా స్వాగతించారు.





**ఆత్మకూరు నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో....**

మొదటగా చేజర్ల మండలంలోని ఏటూరు గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ ఉగ్గుముడి భాగ్యమ్మ, రఘురామిరెడ్డి, గ్రామపెద్దలు నారపరెడ్డి దయాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రమీలమ్మ అందరూకలసి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత అనంతసాగరం మండలంలోని సంజీవనగర్ గ్రామంలో సర్పంచ్ కత్తి వెంకటయ్య, గ్రామపెద్దలు శ్రీ రామానాయుడు, శ్రీమతి విజయమ్మ, భవనదాత డాక్టర్ సుబ్బరాయుడు, విపిఆర్‌ల సమక్షంలో వాటర్‌ప్లాంట్‌కు ప్రారంభోత్సవం జరిగింది. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సమక్షంలో ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత, ఆత్మకూరు మండలంలోని వెన్నవాడ గ్రామంలో సర్పంచ్, ప్రజలు, విపిఆర్ వికాస్ యూత్ సభ్యుడు, భవనదాత విజయ్‌రెడ్డి, ఆయన సహచరులు వేమిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. సర్పంచ్ బొర్రా వెంగమ్మ, గ్రామపెద్దలు కె.పుల్లారెడ్డి, శ్రీమతి రత్నమ్మ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల సమక్షంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభమైంది. చివరగా సంగం మండలంలోని కోలగట్ల గ్రామంలో సర్పంచ్, ప్రజలు, విపిఆర్ వికాస్ యూత్ సభ్యులు విపిఆర్‌కు ఘనస్వాగతం పలికారు. ఆ గ్రామంలో సర్పంచ్ ఏటూరు సుధాకర్‌రెడ్డి, గ్రామపెద్దలు పి.సుందరరామిరెడ్డి, శ్రీమతి హజరత్తమ్మ, వేమిరెడ్డిల సమక్షంలో వాటర్ ప్లాంట్‌కు ప్రారంభోత్సవం జరిగింది. విపిఆర్ వికాస్‌యూత్ సభ్యులు వెంకటకిషోర్, ఆయన సహచరులు ఈ సందర్భంగా విపిఆర్‌కు ఘనస్వాగతం పలికారు. 6వ విడతగా జరిగిన ఈ మినరల్ వాటర్‌ప్లాంట్‌ల ప్రారంభోత్సవాలతో ఆయా గ్రామప్రజలు దాత ప్రభాకర్‌రెడ్డి దాతృత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ ఎన్.శంకర్, సింహపురి హాస్పిటల్స్ అధినేత కె.రవీంద్రరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త డిఇఓకు అపస్మా అభినందనలు



కొత్తగా నెల్లూరుజిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్యామ్యూల్‌కి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, కార్యదర్శి వై.వెంకటరామయ్య, నగర అధ్యక్షులు శౌరెడ్డి, కోశాధికారి కృష్ణారావు, కె.రవీంద్రరెడ్డి, వై.మల్లిఖార్జునరెడ్డి, అభిషేక్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కె.భాస్కర్‌రెడ్డిలు ఇటీవల డి.ఇ.ఓ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో విద్యాసంబంధ విషయాలు, సమస్యలపై వారు డి.ఇ.ఓతో చర్చించారు.

## విశిష్ఠ అవార్డునందుకున్న శ్రీహరిరెడ్డి



నెల్లూరులోని మమత నర్సింగ్ హోమ్ అధినేత బద్దెవోలు శ్రీహరిరెడ్డి ఇటీవల తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథం చేతుల మీదుగా 'వశిష్ఠ వారిస్ట్ నాగరిక అవార్డ్'ను అందుకున్నారు. వివిధ రంగాలలో చేసిన సేవలకుగాను సీనియర్ సిటిజన్ విభాగం నుండి ఆయనకు అవార్డును అందజేశారు. ప్రవాస భారతీయుడు, ప్రముఖ సేవాతత్పరుడు డాక్టర్ నసమాల ప్రేమ్‌సాగర్‌రెడ్డి తన జన్మభూమి నెల్లూరుజిల్లాలో నిర్వహిస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలను శ్రీహరిరెడ్డి పర్యవేక్షిస్తుంటారు. ఎంతో ప్రాధాన్యతగల అవార్డును అందుకున్న శ్రీహరిరెడ్డికి 'లాయర్' అభినందనలు.

## పోలీసుల స్వచ్ఛభారత్



ఈ నెల 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా 16వ తేదీన జిల్లా ఎస్పీ పి.హెచ్.డి రామకృష్ణ ఆదేశాల మేరకు ఏఎస్పీ బి.శరత్‌బాబు ఆధ్వర్యంలో నెల్లూరులోని బి.సి వెల్ఫేర్ హాస్టల్‌నందు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రంచేసి పూలమాల వేసి నివాళులర్పించారు. మూలాపేట రామయ్య బడిలో కూడా 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు. అలాగే ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు ఆధ్వర్యంలో పోలీసు అధికారుల సంఘం భవనంలో పోలీసు అధికారులు, సిబ్బందికి 'పోలీసు విధులు – అమలుపరుచు విధానాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 40మంది సిబ్బంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీనివాసరావు, సిఐడి సిఐ శ్రీనివాసరెడ్డి, సి.ఐ మంగారావు, ఎస్.ఐ వెంకట్రావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు యం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీలో ఆహారదినోత్సవం



ఈ నెల 16వ తేదీన ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని నేతాజీ(ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ప్లేక్లాస్ నుండి 5వ తరగతి వరకు చిన్నారులు 360 రకాల వంటకాలను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించి, ఒక్కో ఆహార పదార్థం యొక్క ప్రయోజనాన్ని వివరించారు. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ వల్ల వచ్చే నష్టాలను కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రెసిడెంట్ వేదవతి, కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, నరేంద్రరెడ్డి, డి.వాణి, హెడ్‌మాస్టర్ యం.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## అమెరికాకు వెళ్లిన సోమిరెడ్డి



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ నెల 16వ తేదీ అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. 17వ తేదీ ఉదయం అమెరికాలోని చికాగోలో దిగిన ఆయన అక్కడ వ్యవసాయ శాస్త్రవేత్తలతో, వ్యవసాయశాఖ కార్యదర్శులతో సమావేశమయ్యారు. జాన్‌డీర్ కంపెనీని సందర్శించారు. అలాగే విత్తనాభివృద్ధి కేంద్రాలను పరిశీలించారు. 18, 19, 20 తేదీలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి స్థానికంగా జరిగిన వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలలో పాల్గొన్నారు. 21వ తేదీ ఆయన చికాగో నుండి బయలుదేరి 22వ తేదీ సాయంత్రం హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగనున్నారు.

## 25న ఐఏబి సమావేశం

జిల్లా సాగునీటి సలహా మండలి(ఐఏబి) సమావేశాన్ని ఈనెల 25వ తేదీన ఏర్పాటుచేసి మొదటి పంటకు సోమశిల ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టులోకి 40 టిఎంసీలు నీరు చేరిందని, ఇంకా నీరు వస్తోందని తెలిపారు. తమిళనాడుకు ఇవ్వాల్సిన వాటాలో కర్ణాటక, తెలంగాణాలు తమ వాటా నీటిని విడుదల చేయాలని లేఖ వ్రాసామన్నారు.

## గుండెపోటుకు గురైన జిల్లా వైద్యాధికారి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వరసుందరంకు 16వ తేదీ సోమవారం ఉదయం 8గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చింది. వెంటనే ఆయనను నెల్లూరులోని 'కిమ్స్' ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి గుండెకు రక్తసరఫరా చేసే మూడు నాళాలు 90 శాతం బ్లాక్ అయినట్లుగా గుర్తించారు. వెంటనే మూడు స్టంట్‌లు వేశారు. వరసుందరం ఇప్పుడు కోలుకుని బాగానే వున్నారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుతో పాటు పలువురు జిల్లా అధికారులు ఆయనను పరామర్శించారు.

## ఆనం విజయకు అదే పదవి



వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకుడు ఆనం విజయకుమార్‌రెడ్డి మరలా నియమితులయ్యారు. గతంలో నియమించిన రాష్ట్ర కార్యదర్శి పదవీ కాలం జూలైలో జరిగిన జాతీయ పార్టీ ప్లీనరీతో పూర్తయిన నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆనం విజయకుమార్‌రెడ్డిని తిరిగి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

## ఇ.ఓల సంఘం అధ్యక్షునిగా జనార్ధనరెడ్డి

దేవాదాయశాఖ జిల్లా కార్యనిర్వహణాధికారుల సంఘం అధ్యక్షునిగా శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 14న జరిగిన ఇ.ఓల సంఘం సభ్యుల సమావేశంలో ఆ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోవూరు జనార్ధనరెడ్డి అధ్యక్షునిగా ఎన్నికకగా, ఉపాధ్యక్షునిగా ఎం.రవికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఏ.రాధాకృష్ణ, కార్యదర్శిగా ఏ.వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా బి.మల్లికార్జునరెడ్డి, కోశాధికారిగా ఏ.వి శ్రీనివాసులరెడ్డిలతో పాటు మరో అయిదుగురు కార్యవర్గ సభ్యులను ఈ కార్యవర్గంలో ఎంపిక చేసుకున్నారు. పలు ఆలయాల ఇ.ఓలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వానొస్తే... వాకింగ్ బంద్

నెల్లూరు నగరంలో తెల్లారుజామున 5 గంటల నుండే వందలాది మంది గుమికూడే చోటు ఏ.సి స్టేడియం. అన్ని వయస్సుల వారు పొద్దున్నే వాకింగ్‌కు వస్తుంటారు. ఇటీవల స్టేడియంలో అభివృద్ధి పనుల పేరిట మైదానంలో మట్టి తోలి రోలింగ్ చేయించారు. గతంలో వాన పడినా స్టేడియంలో వాకింగ్ చేసేటట్లుండేది. ఇప్పుడు వానొస్తే స్టేడియం బురద బురదగా మారి వాకింగ్‌కు అనువుగా వుండడం లేదు. దీంతో వానొస్తే వాకర్స్ వాకింగ్ ఆపుకోవడమో లేక రోడ్లపై పడి నడవడమో చేస్తున్నారు.

## అరకొరగా... పందుల ఏరివేత

నగరంలో పందుల ఏరివేతను అరకొరగా చేపట్టారు. పందుల యజమానులు బలంగా అడ్డుకోవడంతో ఆడ పందులను వదిలేసారు. ఒక ఆడ పంది వుంటే చాలు... సంవత్సరానికి పాతిక తక్కువ కాకుండా పిల్లలు దిగుతాయి. కాలనీ అంతా విస్తరిస్తాయి. పందులను ఏరేస్తున్నామని చెప్పి నెల కాలేదు, అప్పుడే రోడ్ల మీద యధాపలంగా పందులు రాజ్యమేలుతున్నాయి.

## రోడ్డును పాడు చేసారు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఇరుకళల పరమేశ్వరమ్మ గుడి నుండి దొడ్ల డెయిరీ వరకు జొన్నవాడ రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా చేసి వున్నారు. ఇది గత కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన పని. రోడ్డు ఎంతో నీట్‌గా వుండింది. ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా వాహనాలు ఝుమ్మంటూ పోతుండేవి. ఈమధ్య మంచినీటి పైప్‌లైను కోసం రోడ్డుకు ఓ వైపు తవ్వేసారు. తవ్విన మట్టిని తీసేయకుండా రోడ్డు మీద గుట్టలుగా వదిలేసారు. దీంతో ఓ వైపు డబుల్ రోడ్డు కాస్తా సింగిల్ రోడ్డుగా మారి ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తోంది.

## జడ్పీ సమావేశం

నెల్లూరుజిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30గంటలకు జడ్పీ సమావేశమందిరం నందు జరుగుతుందని జడ్పీ సిఇఓ సి.హెచ్.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలియజేశారు. సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

## ఆమంచర్లలో బస్సులు ఆపాలి



నెల్లూరురూరల్ మండలం ఆమంచర్ల సెంటర్‌లో విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నిలపాలని కోరుతూ వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జయవర్ధన్ 16వ తేదీ జేసీ–2 వెంకటసుబ్బారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆమంచర్ల, మన్నవరప్పాడు, సిద్ధవరప్పాడు, గోటువారికండ్రిక, అయ్యప్ప కండ్రిక, బిషప్‌కాలనీ, మట్టెంపాడు, పులదలపాడు గ్రామాల నుండి ప్రజలు, విద్యార్థులు వెయ్యి మంది దాకా రోజూ నెల్లూరుకు రాకపోకలు సాగిస్తుంటారని, ఆమంచర్ల జంక్షన్‌లో బస్సులు నిలపకపోతుండడం వల్ల ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కాబట్టి బస్సులు ఆపేటట్లు చూడాలని వారు జేసీ–2ను కోరారు. జేసీ–2 వెంకటసుబ్బారెడ్డి వెంటనే స్పందించి ఆర్టీసీ ఆర్.ఎంతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు యస్.కె.సిరాజ్, నవీన్, అక్రం, అభి, సంతోష్, మణి, కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్‌లు వస్తే పండగే!

## 'నుడా' ఛైర్మన్ కోటంరెడ్డి శీనయ్య కృషి ఫలిస్తే ట్రాఫిక్ సమస్య తీరినట్లే..



*నెల్లూరు నగరంలో పెద్ద సమస్యలు అని చెప్పుకోదగ్గవి... ట్రాఫిక్, ఇరుకు రోడ్లు, మురికి పందులు, ముదురు దోమలు, కంపుకొట్టే కాలువలు, అధ్వాన్నపు డ్రైనేజీ, పగిలిన రోడ్లు, నగరం నిండా ఆక్రమణలు, సరిగా రాని నీళ్ళు... ఇవన్నీ సాధారణంగా ఎప్పుడూ ఉండేవే! కాని వర్షాకాలం వచ్చిందంటే ప్రజల ముందు అతిపెద్ద సమస్య వచ్చి పడుతుంది. అదే అండర్ బ్రిడ్జిలన్నీ నీళ్ళతో నిండిపోయి రాకపోకలు బంద్ కావడం.*

నెల్లూరు మధ్యలో నుండి వెళ్ళే రైల్వేలైన్ నగరాన్ని రెండుగా చీలుస్తుంది. పెన్నానది బ్రిడ్జి నుండి అయ్యప్పగుడి ఫ్లైఓవర్ వరకు నగరంలో వున్న రైల్వే ట్రాక్‌ు ఇరువైపులా నగరం సమాంతరంగా విస్తరించి వుంది. అయితే రైల్వే ట్రాక్ వేరు చేసిన ఇరు ప్రాంతాలను కలిపే విధంగా ఆత్మకూరు బస్టాండ్, విజయ మహల్‌గేటు, రామలింగాపురం, మాగుంట లే అవుట్‌ల వద్ద అండర్‌బ్రిడ్జిలు, రంగనాయకులపేట, శెట్టిగుంట రోడ్డు, కొండాయపాలెం రోడ్డు, బి.వి.నగర్, వేదాయపాలెం వద్ద రైల్వే గేట్లున్నాయి. ఆత్మకూరు బస్టాండ్ నుండి మాగుంట లేఅవుట్ వరకు నగరం నిండిపోయివుంది. వాహనాల రద్దీ అధికం. ఈ మధ్యలో నాలుగు అండర్ బ్రిడ్జిలే! వర్షాకాలంలో ఇవన్నీ నిండిపోతాయి. అటు ఇటు వెళ్లడానికి వుండదు. వాహనాల రాకపోకలు స్థంభిస్తుంటాయి. రైల్వేగేట్ల వద్ద ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. అయ్యప్పగుడి వద్ద రైల్వే ఓవర్ వంతెన వున్నా నగరానికి ఓ చివర ఉండడంతో ప్రజలు పెద్దగా ఉపయోగించుకోరు. గతంలోనే ఈ నాలుగు అండర్‌బ్రిడ్జిలలో కనీసం ఒక దానినన్నా రైల్వే ఓవర్ బ్రిడ్జిగా నిర్మించి వుంటే వర్షాల సీజన్‌లో వాహనాల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. నెల్లూరు నగరంలో రైల్వే ట్రాక్ ఇరువైపుల ప్రాంతాలను కలిపే విధంగా కనీసం రెండు, మూడు రైల్వే ఫ్లైఓవర్ వంతెనలు అవసరమైన నేపథ్యంలో, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించడం విశేషం.

ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి.వి.నగర్, కొండాయపాలెం గేట్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బి, దక్షిణ మధ్య రైల్వే అధికారులు సంయుక్తంగా ఈ రెండు ప్రాంతాలను పరిశీలించారని, ఒక్కో ఫ్లై ఓవర్ తొలి దశ నిర్మాణానికి 45 కోట్లు అవుతుందనే అంచనాలతో నివేదిక రూపొందించారని ఆయన తెలిపారు. ఈ వంతెనల మంజూరుకు ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. మున్సిపల్ మంత్రి నారాయణ సహకారంతో ముత్యాలపాలెం వద్ద మూడో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు శీనయ్య వెల్లడించారు. ఈ మూడు వంతెనల నిర్మాణం పూర్తయితే నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యకు పెద్ద పరిష్కారం దొరికినట్లేనని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీడీపీ నాయకులు మొయినుద్దీన్, జలదంకి సుధాకర్, అంచూరు శ్రీనివాసులు, కె.బాలాజీ, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# జాతరలా ఋణమాఫీ వేదిక



నెల్లూరుజిల్లాలో ఋణమాఫీ అమలుకు నోచుకోని రైతుల వివరాలు సేకరించి, వారికి ఋణ మాఫీని వర్తింప చేసేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో 14, 15 తేదీలలో 'ఋణ ఉపశమన పరిష్కార వేదిక'ను ఏర్పాటు చేయడం జరిగింది. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ హాల్‌లో రైతు సాధికారిక సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారు. రైతుల నుండి వినతులు స్వీకరించేందుకు మొత్తం 10 కౌంటర్లు ఏర్పాటు చేశారు. 3 విడతలలో ఋణ మాఫీ కాని రైతులు తండోప తండాలుగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. రైతులు తీసుకొచ్చిన గుర్తింపు పత్రాలను పరిశీలించి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. 14వ తేదీ ఉదయం వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాల్ వద్దకు వచ్చి కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. రైతులను ఎలాంటి ఇబ్బందులను పెట్టొద్దని, వారి నుండి శాంతంగా వివరాలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మేయర్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ-2 వెంకటసుబ్బారెడ్డిల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాఫీగా నడిచింది. మొదటిరోజు 1658 మంది రైతులు, రెండోరోజైన ఆదివారం 1661 మంది రైతులు మొత్తం 3318 మంది రైతులు తమ అర్జీలను సమర్పించుకున్నారు. వందల సంఖ్యలో రైతులు తరలి రావడంతో కలెక్టరేట్‌లో ఓ జాతర వాతావరణం ఏర్పడింది.

# కఠినంగా ట్రాఫిక్ నిబంధనలు

### - జిల్లా ఎస్పీ రామకృష్ణ



నెల్లూరులో ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా వుంటాయని నెల్లూరు జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, ఉప రవాణాశాఖ కమిషనర్ శివ రామ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ నెల్లూరు నగరంలోని స్వర్ణ వేదిక కళ్యాణ మండపంలో ట్రాఫిక్ సలహామండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత రెండు నెలలుగా డ్రైవింగ్ లైసెన్సు లేనివారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్ మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 2,500 కేసులు నమోదు చేసామన్నారు. ఇక నుంచి ప్రయాణీకులు, స్కూలు పిల్లలను తీసుకెళ్ళే ఆటోల్లో సామర్థ్యానికి మించి తరలిస్తే చర్యలు తీవ్రంగా వుంటాయన్నారు. ఆటోల్లో డ్రైవర్ మినహా నలుగురు కంటే ఎక్కువగా ఎక్కించినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. డిటిసి శివరామప్రసాద్ మాట్లాడుతూ నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాల్లో ఆటోల్లో ఓవర్ లోడు వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నివారించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ రహదారులు, పట్టణాల్లో, గ్రామాల్లో, స్కూల్ ఆటోల్లో ఓవర్‌లోడింగ్‌పై ఇప్పటికే అవగాహన కల్పించామని, స్కూల్ ఆటోల్లో ఐదుగురికి మించి ఎక్కించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పీ రామారావు, నగర డిఎస్పీ మురళీకృష్ణ, రవాణా సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బలహీన వర్గాలకు...

# బలమైన తోడు టీడీపీనే



ఆంధ్రప్రదేశ్‌లో నిన్నయినా, నేడయినా, రేపయినా బలహీన వర్గాల ప్రజలకు బలమైన అండగా నిలబడేది, వారి అభివృద్ధికి పాటు పడేది తెలుగుదేశం పార్టీయే అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. 16వ తేదీ నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న ఐదేళ్లలో బీసిల బడ్జెట్ 2,351కోట్లయితే, తెలుగుదేశం ప్రభుత్వం ఈ మూడేళ్లలోనే బీసీల అభ్యున్నతికి 25వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ లోటు వున్నా విద్యార్థులకు కష్టం తెలియనీయకుండా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తోందని చెప్పారు. నిన్నటివరకు కాపు రిజర్వేషన్ల పేరుతో ముద్రగడ ముసుగును అడ్డం పెట్టుకుని కాపులను రెచ్చగొట్టాలని చూసిన ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు బీసీలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని, ఆయన ఎన్ని వేషాలేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్‌కు ఇన్నేళ్లుగా గుర్తుకురాని బీసీలు అకస్మాత్తుగా ఇప్పుడెందుకు గుర్తొచ్చారనే విషయం అందరికీ అర్థమవుతుందన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి నిర్మల, కార్పొరేటర్ నూనె మల్లికార్జునయాదవ్, సి.హెచ్.హరిబాబుయాదవ్, ఓంప్రకాశ్‌యాదవ్, బి.వి.లక్ష్మి, పి.ఎల్.రావు పాల్గొన్నారు.

# విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

నెల్లూరురూరల్ మండలం పొట్టేపాలెం గ్రామంలో విషజ్వరాలతో ప్రాణాలు పోతున్నాయని, అధికార యంత్రాంగం అత్యవసరంగా గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీ పొట్టేపాలెంలో ఆయన జ్వర పీడితులను పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన చల్లా శ్రీనివాసులు, యల్లసిరి రమణమ్మ, గుంటూరు శీనయ్య కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ జ్వరాన్ని ఎన్టీఆర్ వైద్యసేవలో చేర్చి ఉచిత వైద్యం అందించాలని కోరారు. మృతుల కుటుంబసభ్యులకు రూ.5లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# బుల్లి సచిన్‌కు అనిల్ అభినందనలు



కడప జిల్లాలో ఇటీవల జరిగిన అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో రెండు ట్రిబుల్ సెంచరీలు చేసిన నెల్లూరుకు చెందిన రేవంత్‌రెడ్డిని నెల్లూరు నగర శాసనసభ్యులు డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ అభినందించారు. ఆ విభాగంలో ఇలా రెండు ట్రిబుల్ సెంచరీలు సాధించిన మొట్టమొదటి క్రీడాకారుడు రేవంతేనని, రాష్ట్రంలో ఇదే తొలి సారని అంటూ ఆ క్రీడాకారునికి క్రికెట్‌బ్యాట్‌ను, 5వేల రూపాయల నగదును అందజేశారు. నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 15న జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, రెండు ట్రిబుల్ సెంచరీలు చేయడమే కాక, 800రన్‌లు చేయడం కూడా గొప్పవిషయమన్నారు. క్రికెట్‌లో నెల్లూరు పేరు మారు మ్రోగించిన ఆ క్రీడాకారునికి, క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు, కోచ్ చంద్రశేఖర్‌రెడ్డికి ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. యువకుల్లో క్రికెట్ ఆడాలన్న ఉత్సాహం ఎంతగానో ఉన్నప్పటికీ సరైన వసతులు లేకపోవడం విచారకరమన్నారు. ఇక్కడి క్రికెట్ స్టేడియంలో ఆమేరకు మంచి వసతులు ఉండడం అభినందనీయమన్నారు. క్రికెట్‌పై ఉత్సాహం కనబరచేవారికి సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. రేవంత్‌తో పాటు సహకరించిన క్రికెట్ క్రీడాకారుడు ఎస్‌కె కమల్‌ను కూడా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు తాటిపర్తి సునీల్‌కుమార్, వడ్లమూడి చంద్ర, ఏ.జనార్ధనరెడ్డి, గంధం సుధీర్‌బాబు, అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌కు సన్మానం

అలాగే ఇంతకుముందు రేవంత్‌రెడ్డిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఏసి క్రీడా మైదానంలో ఘనంగా సన్మానించారు. క్రికెట్ అసోసియేషన్ నుంచి ఆ పరుగుల వీరుడికి 10వేల రూపాయల చెక్కును బహుమతిగా అందజేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పివి రమణయ్య ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, ఒకే టోర్నమెంట్‌లో రెండుసార్లు ట్రిబుల్ సెంచరీలు సాధించడం ఇదే ప్రథమమంటూ రేవంత్‌ను అభినందించారు.

# హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

- శ్రీ కమలానందభారతి స్వామీజీ

మన హిందూ ధర్మం ఎంతో గొప్పది.. పవిత్రమైనదని, మన ధర్మాన్ని మనం పరిరక్షించుకోవాలని, ఇది మనందరి బాధ్యత అని హిందూ దేవాలయ ప్రతిష్టాపన పీఠం పీఠాధిపతి శ్రీ కమలానందభారతి స్వామీజీ తెలిపారు. ఈనెల 14న ఆయన గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. మన ధర్మాన్ని మనం గౌరవించుకుంటూ ధర్మపరిరక్షణకు అందరం పాటుపడాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, స్థానిక సమరసత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి, ఎండోమెంట్ డైరెక్టర్ విజయరాఘవాచార్యులు, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్‌లతో కలసి, స్వామీజీ సంపూర్ణ గ్రామ సందర్శన రథయాత్రను ప్రారంభించారు. విజయరాఘవాచార్యులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు కూడా ఈ యాత్రను దిగ్విజయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 26వ తేది వరకు గూడూరు మండలంలో ఈ రథయాత్ర జరుగుతుందని, ఈ యాత్రలో భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోట సునీల్‌కుమార్ కోరారు.



ఇటీవల గూడూరు డివిజన్ చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో 18 లక్షలతో సిమెంటురోడ్లు, 5లక్షలతో జడ్పీ హైస్కూలులో పూర్తయిన గ్రౌండ్ అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, అడ్వకేట్ అరుణ్‌బాబు తదితరులు.

గూడూరు డివిజన్ వార్తలు



# నేరాల అదుపుకు కఠిన చర్యలు

డిఎస్పీ రాంబాబు

డివిజన్‌లో నేరాల అదుపుకు కఠిన చర్యలు తీసుకొంటామని గూడూరు డిఎస్పీ వి.ఎస్.రాంబాబు తెలిపారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో గూడూరు డివిజన్‌లోని సి.ఐలు, ఎస్సైలతో నేరాల అదుపునకై సమీక్షా సమావేశాన్ని ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలతో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్, ఎర్రచందనం, ఇసుక, సిలికా అక్రమ రవాణాకి పాల్పడినా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలను పోలీసులు అందించాలని కోరారు. గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చోరీలకు పాల్పడే నిందితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. నేరాల సంఖ్య గణనీయంగా తగ్గించడంతో పాటు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్‌లోని సి.ఐలు సుబ్బారావు, అక్కేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉప్పాల సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

# వీరజవాన్ల త్యాగాలు స్మరించుకోవాలి



గూడూరు పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో భాగంగా పోలీసులు అమరవీరుల స్మృతి ర్యాలీని ఆదివారం డిఎస్పీ వి.ఎస్.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ వీరజవాన్ల త్యాగాలను స్మరించుకోవడం పోలీసుల కర్తవ్యమని తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సిఐలు సుబ్బారావు, అక్కేశ్వరరావు, ఎస్సై సుధాకర్, ఇంకా పలువురు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజల్స్‌కు ప్రతిభా అవార్డుల పంట








గూడూరు చిల్లకూరులోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్‌కు రాష్ట్ర ప్రభుత్వం 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఇచ్చే పురస్కారాలు ప్రతిభ అవార్డులు చిల్లకూరు మండలానికి ఇచ్చిన 6 అవార్డులు మొత్తం లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూలుకు దక్కాయి. ఈ పాఠశాలలో చదివిన ఆనిమెళ్ళ తేజాసాత్విక్, అన్నం ఏకాంత్, బొర్రా లిఖిత, సంక్రాంతి ప్రగతి, నెల్లపూడి ఉపేంద్ర, శెట్టి హేమంత్‌లకు 6 ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. విజయవాడలో ఆదివారం జరిగిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిభ అవార్డులు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# విఎస్ఆర్‌లో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు పట్టణంలో విఎస్ఆర్ పాఠశాలలో మాజీరాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపిజె అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఈ నెల 15న అబ్దుల్ కలాం చారిటీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొనకా దేవసేన, డిఎస్పీ వి.ఎస్.రాంబాబులతో కలసి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నిర్వహించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన అబ్దుల్‌కలాం ఒక శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఎదిగారని, ఆ మహనీయుని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఛైర్‌పర్సన్ దేవసేన, డిఎస్పీ రాంబాబు మాట్లాడుతూ పేదరికం మనిషి ఎదుగదలకి అడ్డం రాదని నిరూపించిన మహనీయుడు అబ్దుల్‌కలాం అని చెప్పారు. లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేస్తే జీవితాన్ని కోల్పోతా మని, లక్ష్యం ఉంటే ప్రతిఒక్కరూ దేశంలో ఎంతటి స్థానాన్ని అయినా పొందగలరని తెలిపారు. అనంతరం పలు స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులను సత్కరించి మెమెం టోలను, వృద్ధులకు ముస్లిం మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, సహకార బ్యాంకు ఉపాధ్యక్షుడు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు పిట్టి నాగరాజు, సి.ఐ సుబ్బారావు, కౌన్సిలర్ ఇజ్రాయిల్ కుమార్, రజాలా, అరవ పార్వతయ్య, సురేష్‌రెడ్డి, రమణారెడ్డి, సురేంద్ర, సుందరయ్య, గూడూరు శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వైజేపి లయన్స్ సరుకులు

గూడూరు పట్టణంలో వైజేపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు, నిరాశ్రయులకు ఫలసరుకులను ఇటీవల పంపిణీ చేశారు. క్లబ్ ద్వారా వృద్ధులను ఆదుకొని ప్రతి నెల ఫలసరుకులు అందించడం సంతోషంగా ఉందని క్లబ్ అధ్యక్షుడు బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీరాజు, ప్రతినిధులు ఎస్ఎల్ఎన్ బాబు, రమణయ్య, ఆర్.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్‌టి దెబ్బకు దీపావళి తుస్...

శ్రీను గల్పిక

అది ద్వారకా నగరం. సత్యభామ టీవీలో జిమ్‌జామ్ ఛానెల్ పెట్టుకుని 'తన్నితే పెళ్ళాం చేతే తన్నించుకోవాలి' సీరియల్ 18,472వ ఎపిసోడ్ చూస్తోంది. దాదాపు 10,411వ ఎపిసోడ్ నుండి మొగుడిని పెళ్లాం తన్నే సీన్‌లే తిప్పి తిప్పి చూపిస్తూ ఆ ఛానల్ వాళ్ళు మగజాతి పట్ల వున్న తమ విద్వేషాన్ని చాటుకుంటున్నారు. కరెక్ట్‌గా పెళ్లాం తంతే మొగుడు ఎగిరి గోడ మీద పడతాడు. ఆ సస్పెన్స్‌లోనే సీరియల్‌లో బ్రేక్... అప్పుడే లలితా జ్యూయలరీ యాడ్‌లో గుండు బాస్ వచ్చాడు. బంగారం ఎక్కడ కొంటున్నారు... ఇతర షాపులలో సరిచూసుకుంటున్నారా... అంటూ ప్రకటనలో చెబుతుండగా... "నారాయణ నారాయణ" అంటూ నారద మహర్షి అక్కడకు వచ్చాడు. రాగానే టీవీలో వస్తున్న లలిత జ్యూయలరీ గుండుబాస్ యాడ్ చూసాడు. సత్యభామతో... నిన్న ఇతన్ని ఎక్కడో చూసానమ్మా... అని అన్నాడు. ఎక్కడ స్వామీ అని సత్యభామ అడిగింది. ఆ గుర్తొచ్చిందమ్మా... నిన్న మీ శ్రీవారు కృష్ణ భగవానుడు, నేను చెన్నైలోని లలిత జ్యూయలర్స్‌కు వెళ్లాం.. అక్కడే ఈ గుండతన్ని చూసాను అని అన్నాడు. లలిత జ్యూయలర్స్‌కు వెళ్లారా... ఏం కొన్నారు స్వామీ అని సత్యభామ ఆతృతగా అడిగింది. దానికి నారదుడు... అదే 50లక్షల ఖరీదు చేసే డైమండ్ నక్లెస్ సెట్ అమ్మా... ఇంతకీ నీ వద్దకు తేలేదా అని నారదుడు నసుగుతూ అడిగాడు. నా వద్దకు తేలేదు స్వామీ అని సత్య చెప్పింది. అలాగైతే ఎక్కడ ఇచ్చి వుంటాడో, ఎవరికి ఇచ్చి వుంటాడో అంటూ నారదుడు అగ్గిపుల్ల గీసేసాడు. సత్యభామ ఆవేశంతో వూగిపోయింది. అప్పుడే పిల్లనగ్రోవి వూదుకుంటూ శ్రీకృష్ణుడు ఇంట్లో అడుగుపెట్టాడు. అలా అడుగుపెట్టాడో లేదో ఒళ్లంతా సెగ... ఏందబ్బా ఇంత సెగ వుందని లోపలకు చూసాడు. ఎదురుగా నారద మహర్షి కనిపించాడు. అప్పుడే కృష్ణుడి ఎడమకన్ను అదిరింది. గుండెలో రాయిపడ్డట్లయ్యింది. ఈ అగ్గిపుల్ల స్వామి ఏదో మంట పెట్టేసాడు. ఇప్పుడు ఈ మంటను ఆర్పాలంటే ఎన్ని ఫైరింజన్‌లను పిలిపించాలో ఏమో అనుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ బెడ్‌మీద కూర్చుని సత్యభామ బుసలు కొడుతుంది. కృష్ణుడికి పరిస్థితి అర్ధమయ్యింది. సత్య అంటూ ఆమె భుజంపై ప్రేమగా చేయి వేసాడు. అంతే ఆమె విసిరిన విసురుకు బయటకొచ్చి పడ్డాడు. మళ్ళీ లేచి నడుము సర్దుకుని నారదుడి వద్దకు వెళ్లి.... ఈ సెగకు కారణమేంటని అడిగాడు. నిన్న లలిత జ్యూయలర్స్‌లో కొన్న డైమండ్ నక్లెస్ అని నారదుడు చెప్పాడు. నీ నోటికంటే తెలుగు న్యూస్ ఛానెల్స్ నయం నారదా అంటూ శ్రీకృష్ణుడు నిదానంగా సత్యభామ వద్దకు వెళ్లాడు. సత్య... నువ్వు నా మనసును అర్ధం చేసుకోలేదు. నిన్న నేను కొన్న ఆ డైమండ్ నీ సుందరమైన ముఖానికి ఏ మాత్రం సరిపోదు. అందుకే దానిని రుక్మిణికిచ్చేసా.... రేపు ఎలాగూ దీపావళి... స్వయంగా భూలోకానికే వెళదాం... అక్కడ నీకు సెట్ అయ్యే డైమండ్ సెట్‌ను నువ్వే సెలక్ట్‌చేసుకో... రుక్మిణికి ఇచ్చింది 50లక్షల నక్లెస్సే! నీకు కోటి రూపాయలు ఖరీదు చేసే డైమండ్ సెట్ తీసిస్తా కదా అని హామీ ఇచ్చి బయటకొచ్చాడు. అక్కడ నారదుడు... ఏం ప్రభూ... ప్రాబ్లమ్ సాల్వ్ అయ్యిందా అని అడిగాడు. నువ్వు అగ్గి పెట్టావు కదా... దానిని ఆర్పుకోవాలంటే ఇంకో కోటి ఖర్చు... ఖర్చు మాట ఎలాగున్నా... ఆ మోడీతో ఇన్‌కంటాక్స్ బాధ వొకటి అని వాపోయాడు.

చెన్నైలోని లలిత జ్యూయలర్స్ షాపు. మారువేషంలో శ్రీకృష్ణుడు, సత్యభామ, నారదుడు అక్కడకు వెళ్లారు. సత్యభామ ఓ డైమండ్ సెట్‌ను చూసింది. దాని మీద రేటు 95,00,000/- అని వుంది. నారదుడు టక్కున... అమ్మా... దీనికంటే కూడా ఆ ఎర్రరాళ్ళ సెట్ బాగుంది చూడు అని ఇంకోవైపు చూపించాడు. దాని క్రింద రేటు 1,75,00,000/- రూపాయలు అని వుంది. ఆ రేటును చూడగానే కృష్ణుడి గొంతులో వెలక్కాయ పడినట్లయ్యింది. పెళ్లికి పోతూ పిల్లిని చంకలో పెట్టుకోవడం అంటే ఇదే... ఈ నారదుడిని వెంటబెట్టుకుని రాకుండా వున్నా బాగుండేది అని అనుకుంటూ బిల్లు చెల్లించడానికి కౌంటర్ వద్దకు వెళ్లాడు. జిఎస్టీతో కలిపి కోటి 90లక్షలు కట్టేసాడు. ఆ షాపు అధినేత గుండూ బాస్ వీళ్ళతో... ఇప్పుడు తక్కువ అమౌంట్‌తో షాపింగ్ చేసారు సార్... ఈసారి షాపింగ్‌కు వచ్చినప్పుడు మేడమ్‌కు ఖరీదైన నగలు తీసివ్వాలి ఆల్ ది బెస్ట్ అని అన్నాడు. కోటి 90లక్షలు వీడికి చీప్‌గా కనిపిస్తున్నాయా అని కృష్ణుడు మనసులో అనుకుని... అక్కడనుండి బయటపడ్డారు. తెలుగు ప్రజలు దీపావళి పండుగను ఎలా సెలబ్రేట్ చేసుకుంటున్నారో చూద్దామని ఐఆర్ 20 - 420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరానికి వచ్చారు. మొదట నైట్‌రైడర్, మంత్రి నారాయణ ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ ఎలాంటి బాణాసంచా వెలుగులు లేవు. అక్కడ వున్న సెక్యూరిటీతో... మీ సార్, దీపావళి చేసుకోవడం లేదా అని నారదుడు ప్రశ్నించాడు. అందుకు సెక్యూరిటీ... మా సార్ ఏ అర్ధరాత్రి వస్తాడో, ఎప్పుడు పోతాడో తెలియదు. ఇక దీపావళి పండుగ కూడానా? అని చెప్పాడు. తర్వాత వీళ్ళు చిల్డ్రన్స్‌పార్క్ వద్ద వున్న గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఆయన ఇంటి ముందు కూడా దీపావళి వాతావరణం లేదు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సునందతో సత్యభామ వుండి... దీపావళి ఎందుకు చేసుకోవడం లేదని అడిగింది. 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' అంటూ మావారు వెళ్లిపోయారు. ఆయన మా నియోజకవర్గ ప్రజల ఇళ్లల్లో ఎక్కడో ఒక చోట వారితో కలిసి దీపావళి పండుగ చేసుకుంటాడు. ఈసారి మాకు టపాసుల ఖర్చు తగ్గించాడు. అసలే జిఎస్‌టి దెబ్బకు టపాసులు కొనేటట్లు లేవు అని చెప్పింది. కృష్ణుడు బ్యాచ్ అక్కడనుండి బయలుదేరి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్... ఇలా అందరు ఇళ్ల దగ్గర చూసారు. ఎక్కడా టపాసుల మోతే లేదు. అందరూ జిఎస్‌టి దెబ్బకు టపాసులు కొనలేదని చెప్పారు. అప్పుడే ఏ.సి సెంటర్ ప్రాంతంలో "ఢాం ఢాం తుస్... టప... ఫట్ ఫట్" అంటూ పెద్దఎత్తున టపాసుల శబ్దాలు రావడంతో కృష్ణుడు, సత్య, నారదుడు అక్కడకు పరుగెత్తారు. అక్కడ కళ్లకు నల్లద్దాలు పెట్టివున్న స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(66) కనిపించాడు. అక్కడ టపాసులేమీ లేవు కాని... ఢాం ఢాం అంటూ చెవులు పగిలిపోయే శబ్దాలు వస్తున్నాయి. టపాసులు కనిపించడం లేదు. ఈ శబ్దాలేంటి నాయనా అని వివేకాను కృష్ణుడు అడిగాడు. టపాసుల శబ్దాలే స్వామీ... అదిగో శబ్దాలు అక్కడ నుండి వస్తున్నాయి అంటూ ఓ పక్కన చూపించాడు. అక్కడ పెద్దపెద్ద స్పీకర్‌లు వున్నాయి. సి.డి పెట్టి రికార్డ్‌డ్ టపాసుల శబ్దాలు వింటూ దీపావళి టపాసులను కాలుస్తున్నంత ఆనందంగా వున్నారు. ఇదేం దీపావళి నాయనా అని కృష్ణుడు అడిగాడు. ఏం చేసేము స్వామీ... జిఎస్టీ దెబ్బకు టపాసులు కొనేటట్లున్నాయా... అందుకే ఈ రకంగా దీపావళి చేసుకుంటున్నాం అని వివేకా చెప్పాడు. ఆ మాట వినగానే కృష్ణుడికి 'అహనా పెళ్లంట' సినిమాలో కోట శ్రీనివాసరావు కోడిని వేలాడదీసి ఒట్టి అన్నం తినే సీన్ గుర్తుకొచ్చింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, స్వల్పంగా ఆదాయవృద్ధి ఉంటుంది. కుటుంబంలో మీకు అనుకూలత తక్కువ. హామీలివ్వడం, ఋణాలివ్వడం చేయవద్దు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సమావేశాలకు హాజరు కాగలరు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఖర్చులు ఎక్కువగా వుంటాయి. మంచి వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు ఆవేదన కలిగిస్తాయి. వృత్తిపరంగా బాగుండి సంతృప్తికరంగా రాబడి ఉంటుంది. అప్రయత్నంగా అవకాశాలు కలిసివచ్చి పనులు జరిగిపోతాయి. కోర్టు కేసులు వాయిదా పడగలవు. షేర్లు, పెట్టుబడుల మీద లాభాలుండగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. పన్నుల చెల్లింపు జరుపుతారు. కొత్త వస్తువులు, విలువైన వస్తువులు సమకూరుతాయి. ప్రభుత్వ అనుమతులు పొందడం, పలుకుబడి వృద్ధి చెందడం జరుగుతుంది. కొత్త కాంట్రాక్టులు, లీజులు లభించే అవకాశం కలదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయానికి తగ్గట్టు అదనపు ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల ఉంటుంది. పనులు అనుకున్న విధంగా జరుగుతున్నా టెన్షన్‌గా వుంటుంది. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. కొత్త వస్తువులు సమకూరుతాయి. కొత్త పరిచయాలేర్పడి మీ అభివృద్ధికి దోహదపడతాయి. ఉద్యోగులకు అధికార వర్గ సహకారం బాగుంటుంది. స్టాకిష్టులు ఇబ్బంది పడవచ్చును.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు ఆటంకాలు లేకుండా సాగుతాయి. వ్యాపార వ్యవసాయవర్గాలు అభివృద్ధికై కొత్త ప్రయత్నాలు చేస్తారు. వృత్తి జీవనం కలవారికి ఆర్థికంగా బాగుంటుంది. వేడుకలందు పాల్గొంటారు. అనుకోని ప్రయాణాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అనుకూలత ఉన్నది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేసే పనులకు, ప్రయత్నాలకు పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారవృద్ధి ప్రయత్నాలు నెరవేరి ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం సంతృప్తికరం. శుభకార్యాలు నిర్ణయమగుటకు కృషి చేస్తారు. అధికారులకు ప్రమోషన్లు, స్థానమార్పులుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలించగలవు. కొత్త అగ్రిమెంట్లు జరగడం, కాంట్రాక్టులు లభించడం జరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 20.10.2017 నుండి
తేది. 26.10.2017 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహువు, కన్యలో కుజశుక్రులు, తులలో రవిబుధ గురువులు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు, తుల వృశ్చిక ధను: రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము

గురు మౌఢ్యమి జరుగుతున్నది.

మహూర్తములు లేవు

కార్తీక మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | పాడ్యమి | రా॥ గం.12.10వ॥ |
| తేది. 21 | శని | విదియ | రా॥ గం.1.15వ॥ |
| తేది. 22 | ఆది | తదియ | రా॥ గం.2.46వ॥ |
| తేది. 23 | సోమ | చతుర్థి | రా॥ గం.4.38వ॥ |
| తేది. 24 | మంగళ | పంచమి | పూర్తిగ |
| తేది. 25 | బుధ | పంచమి | ఉ॥ గం.6.42వ॥ |
| తేది. 26 | గురు | షష్ఠి | ఉ॥ గం.8.50వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబ వ్యవహారాలను సామరస్యంగా పరిష్కరించగలరు. వృత్తి వ్యాపారవృద్ధి కృషి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. వ్యాపార పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా పడతాయి. బాకీలు రావలసినవి నిలబడిపోతాయి. అనవసర తగాదాలలో దిగవద్దు. ఉద్యోగులకు పని భారం ఎక్కువ. ఆరోగ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చేపట్టిన పనులందు ఆటంకాలుంటాయి. కుటుంబంలో విభేదాలు ఏర్పడవచ్చు, కాబట్టి జాగ్రత్తపడాలి. వ్యాపారవృద్ధి అవకాశాలు తప్పిపోవచ్చును. వృత్తి వ్యాపారములందు సామాన్య ఆదాయముంటుంది. బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. బయట వ్యవహారాలలో అపనిందలు పడవలసి రావచ్చును. అనుకోని అదనపు ఖర్చు ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక ఇబ్బందులు తొలగ గలవు. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకుంటాయి. ఆదాయం పెరుగుతుంది. కొత్త పరిచయాలు జరిగి పనులు సానుకూలం కాగలవు. విలువైన వస్తు, వస్త్రాలు సమకూరుతాయి. గృహ నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు వేగంగా జరిగి ప్రభుత్వ నిధులను పొందగలరు. పన్నుల చెల్లింపు జరుపుతారు. శుభవార్త వింటారు. ఉద్యోగావకాశాలు కలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త వ్యాపార ప్రయత్నాలు చేయడం, పెట్టుబడులకు అవకాశాలు దొరకడం ఉంటుంది. తలపెట్టిన పనులకు చిన్నచిన్న ఆటంకాలు కలగడం, టెన్షన్ పడటం జరుగుతుంది. మీ ఆలోచనలతో కుటుంబసభ్యులు విభేదించవచ్చు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆదాయం సంతృప్తికరం. ముఖ్య వస్తువులను, పత్రాలను పదిలపరచుకొనాలి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేసే పనులపై శ్రద్ధ ఉండక మాటలు పడవలసి ఉంటుంది. పరిస్థితులను బట్టి సర్దుకొని పోవలసి ఉంటుంది. వ్యాపారవృద్ధికై చేసే ప్రయత్నాలలో అనుకూలత, సామాన్య ఆదాయం ఉంటుంది. ఉద్యోగులు అధికారులతోనూ, పబ్లిక్‌తోను జాగ్రత్తగా ఉండాలి. వివాద సమస్యలు సర్దుబాటు కాగలవు. వృత్తి జీవనం కలవారికి అభివృద్ధి, రాబడి బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక ఇబ్బందులుండినా, అధిగమించే ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు బాగుంటాయి. ప్రయత్నం చేయాలి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వ్యాపారవర్గాలకు కొంత నిరుత్సాహం తప్పదు. ఆదాయం సామాన్యం. కోర్టు కేసులు వాయిదాపడతాయి. చిన్న విషయాలపై బంధువర్గంతో విభేదాలు కలుగవచ్చును. పనులు మందకొడిగా సాగుతాయి.

విజయమూరు సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డికి

# ఉత్తమ సర్పంచ్ అవార్డ్



విజయమూరు మేజర్ గ్రామ పంచాయితీని స్వచ్ఛభారత్‌లో అగ్రగామిగా నిలిపిన ఆ గ్రామ సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డి ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్నాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నాడు. విజయమూరు గ్రామాన్ని పారిశుద్ధ్య పరంగా పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం లోనూ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లోనూ పంచాయితీని ప్రథమస్థానంలో నిలిపాడు. ఈ కృషితోనే ఆయనను ఈ అవార్డు వరించింది. జనవరి 26వ తేదీ నెల్లూరులో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలలో కూడా ఆయన స్వచ్ఛభారత్ అవార్డును అందుకోనున్నారు.

# కోడిగుడ్డు.. మంచి పౌష్టికాహారం



కోడిగుడ్డు మంచి పౌష్టికాహారమని, రోజూ రెండు ఉడికించిన కోడిగుడ్లు తింటే ఆరోగ్యం బాగుంటుందని నెక్ మాజీ జోనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు అన్నారు. జిల్లా లేయర్ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ప్రపంచ కోడిగుడ్డు దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని కూరగాయల మార్కెట్ సమీపంలోని ఆర్ఆర్ ఎగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిఏటా అక్టోబర్ నెల రెండవ శుక్రవారం రోజున ప్రపంచ కోడిగుడ్డు దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కండపుష్టి, ఎముకలకు బలం, జ్ఞాపకశక్తి, కంటిచూపు మెరుగుదల వంటి ఎన్నో ప్రయోజనాలు కోడిగుడ్డులో ఉన్నాయన్నారు. లేయర్ పౌల్ట్రీఫార్మర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.రాఘవరావు, నెక్ జోనల్ కమిటీ మెంబర్ పి.శివరామయ్య, పి.వెంకట్రామయ్య, కె.హరీష్, కెకె మణి,ఎన్‌వి రమణారెడ్డి, ఎన్ కిషోర్, ప్రసాద్ తదితర రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు, వాకర్స్‌కు నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో ఉడికించిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఎస్.రాఘవేంద్రశెట్టి, డాక్టర్ కె. అంకిరెడ్డి, కె.తిరుపతినాయుడు, ఎం.హరిరావు, ఎస్ఎం బాషా, జి.ఓబుల్‌రెడ్డి, డివి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయిదర్బార్ భక్త బృందంచే...

# షిరిడిలో సాయి పల్లకీ ఉత్సవం



శ్రీ షిరిడి సాయిబాబా మహాసమాధి శతాబ్ది మహోత్సవాలకు నెల్లూరు బాలాజీ నగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరం నుండి షిరిడి వెళ్లిన 250మంది సాయి భక్తులతో ఈ నెల 11వ తేదీ షిరిడి పురవీధుల్లో శ్రీ సాయిబాబా పల్లకీ మహోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. షిరిడిలోని పింపిల్‌వాడి రోడ్డులో వున్న శ్రీ సాయి ఆరాధన క్షేత్రంలో విశేష పుష్పాలంక రణతో ఉన్న పల్లకీలో ఆశీనులైన శ్రీ సాయి నాథ్ మహారాజ్‌కు నైవేద్యాలు, విశేష హారతులు సమర్పించిన అనంతరం శిరిడి బ్యాండు మేళాలతో, భక్తుల నృత్యాలతో సాయినామ సంకీర్తనలతో శ్రీ సాయినాథుని జయజయ ధ్వానాలతో శిరిడి వీధులు మారుమ్రోగాయి. అనంతరం పల్లకి ఉత్సవం ఖండోబా దేవాలయానికి చేరుకుంది. అక్కడ పూజాది కార్యక్రమాలనం తరం చావడి చేరుకుని, ద్వారకామాయి వద్ద నృత్యాలు, భజనలతో శ్రీసాయినాథుని సమాధిని, శ్రీసాయినాథుని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఈ సంద ర్భంగా శ్రీ సాయిదర్బార్ ఛైర్మెన్ మధు సాయి మాట్లాడుతూ బాబా ఆజ్ఞ, పిలుపు లేనిదే శిరిడిలో అడుగుపెట్టలేరని, ఇది ఎంతోమంది భక్తుల అనుభవమన్నారు. కేవలం బాబా దయతో, పిలుపుతో ఇంతమంది భక్తులు శిరిడి నేలపై సాయి ఊసులో, సాయి ధ్యాసలో, సాయి స్మరణతో, సాయి సచ్చరిత్ర పారాయణంతో గడిపామన్నారు. ఇది భక్తులందరి మహద్భాగ్యమన్నారు.

## కనువిందు చేసే ఓల్డ్ షిరిడి



షిరిడి నుండి సకోరి వెళ్ళే దారిలో 3 కిలోమీటర్లు వద్దనున్న భక్త నివాస్ ప్రక్కన ఏర్పాటు చేసిన "ఓల్డ్ షిరిడి గ్రామం" భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తొలుత సాయిబాబా షిరిడి గ్రామ ప్రవేశం నుండి తుది శ్వాస విడిచే వరకు వివిధ రూపాల్లో కళాకారులు సజీవంగా ఉన్నట్లు మలచిన బొమ్మలు అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాయి.

# మన్ననలందుకుంటున్న 'చందన'



రెండు తెలుగు రాష్ట్రాల్లో సిఎంఆర్, చందన వ్యాపార సంస్థలు అత్యంత తక్కువ ధరలకు నాణ్యమైన వస్త్రాలను, బంగారాన్ని అందజేస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలను అందుకుంటున్నాయని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ నెల 15వ తేదీన సిఎంఆర్, చందన దసరా, దీపావళి 'ఫిదా సేల్' 5వ వీక్లీ డ్రాను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తీసి నెల్లూరు సంతపేటకు చెందిన ఎం.మంజులను స్కూటీ విజేతగా ప్రకటించారు. డైలీడ్రాను నెల్లూరునగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఎమ్మెల్యే అనిల్‌లు తీసారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ జిల్లాలో చందన, సిఎంఆర్ సంస్థలు విని యోగదారుల మన్ననలు పొందుతున్నాయన్నారు. సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ దసరా, దీపావళి పర్వదినం సందర్భంగా విని యోగదారులకు గృహోపకరణాలు అందించాలన్న సంకల్పంతో మేలైన దస్తులు, బంగారంతో పాటు ప్రత్యేక ఆఫర్లతో గిఫ్ట్‌లను అందిస్తున్నామన్నారు. రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# అపోలోలో న్యూరోసైన్స్ నర్సింగ్ కోర్సు



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన న్యూరోసైన్స్ నర్సింగ్ కోర్సును ఈ నెల 14వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వర సుందరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో న్యూరాలజీకి అధికప్రాధాన్యత వుందని, ఈ విభాగంలో ఎప్పటికప్పుడు ఆధునిక వైద్య చికిత్స విధానాన్ని అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమన్నారు. కేవలం వైద్య చికిత్సలకే పరిమితం కాకుండా న్యూరాలజీ వైద్య విధానాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న అపోలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్‌ను ఆయన అభినందించారు. డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ న్యూరాలజీపై నర్సులకు పూర్తిస్థాయి అవగాహన, శిక్షణ కల్పిస్తే వ్యాధిగ్రస్తులకు ఇంకా మెరుగైన వైద్యసేవలను అందించవచ్చన్నారు. భవిష్యత్‌లో న్యూరోసైన్స్ నర్సింగ్‌కు వున్న ప్రాధాన్యత దృష్ట్యా అపోలో ఆసుపత్రిలో ఈ కోర్సు శిక్షణ ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైథిలి స్కూల్‌లో

# దీపావళి సంబరాలు



దీపావళిని పురస్కరించుకుని నెల్లూరు చంద్రమౌళి నగర్‌లోని మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈనెల 17న ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు మైథిలి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, మంచికి-చెడుకి జరిగే పోరులో ఎల్లప్పుడూ మంచే విజయం సాధిస్తుందని ఈ పండుగ మనకు తెలియ జేస్తుందన్నారు. దీపావళి రోజున మనం వెలిగించే దీపాలు కాంతివంతంగా ఉన్నట్లే అందరి జీవితాలు కూడా ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ మైథిలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగారాజన్‌కు క్రీడాసంఘాల ఆత్మీయసత్కారం



రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ న్యాయసలహాదారు, జిల్లాలోని వివిధ క్రీడా సంఘాలకు, విద్యార్థి సంఘాలకు న్యాయసలహాదారుగా సేవలందించిన బివిఎస్ రంగరాజన్‌ను జిల్లా కోర్టు ప్రభుత్వ సహాయన్యాయవాదిగా ప్రభుత్వం నియమించడం పట్ల పలు క్రీడాసంఘాలవారు, విద్యార్థి సంఘాల నాయకులు ఆయనకు ఈనెల 15న ఆత్మీయ సన్మానం నిర్వహించారు. నెల్లూరులోని శివాజీసెంటర్‌లో ఉన్న టివిఎస్ కల్యాణసదన్‌లో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బందారు విజయకుమార్‌రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు పి. సురేంద్రరెడ్డి, ఎబివిపి జాతీయకార్యదర్శి లక్ష్మణ్, శాప్ మాజీ డైరెక్టర్ ఎం.రవీంద్రబాబు, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గసభ్యులు కె.మధుసూదన్, బార్ అసోసియేషన్ నాయకులు, ప్రముఖ న్యాయవాదులు, శ్రేయోభిలాషులు పాల్గొని రంగరాజన్‌ను ఘనంగా సత్కరించారు.

# చదువా? చావా?

(మొదటి పేజీ తరువాయి)

యంత్రానికన్నా కరెంట్ పోయినప్పుడు విశ్రాంతి దొరుకుతుందేమో! విద్యార్థికి విశ్రాంతి అన్నదే లేదు. తెల్లారుజాము 5గంటలకే మొదలవుతుంది చదువుల పరుగు. కాలకృత్యాలు, ఆహారం అంతా హడావిడిగానే... ఉదయం ఆరు గంటలకల్లా మార్కుల వేట మొదలవుతుంది. రాత్రి 10గంటల దాకా విరామం లేకుండా ఆ చదువుల ఆట సాగుతుంది. ఈ చదువుల ఆటలు... మార్కుల వేటలో వెనుకబడ్డారా? కాలేజీ యాజమాన్యం నుండి వేధింపులు... తల్లిదండ్రుల నుండి నిట్టూర్పులు... వారికి జీవితంలో ఏదో కోల్పోయామన్న ఫీలింగ్. ఇలాంటి మందలింపులు, వేధింపులను గట్టి గుండె వున్న విద్యార్థులైతే తట్టుకోగలరు. సున్నిత హృదయులైన విద్యార్థులు భరించగలరా? అలా భరించలేక పోతుండబట్టే కాలేజీ హాస్టళ్లలో ఫ్యాన్‌లకు నిర్జీవంగా వేలాడుతున్నారు. బహుళ అంతస్తుల పైనుండి దూకేస్తున్నారు. నూరేళ్ల భవిష్యత్‌కు టీనేజ్‌లోనే సమాధి కడుతున్నారు. తల్లిదండ్రులకు శాశ్వత శోకం మిగిలిస్తున్నారు. కార్పొరేట్ కాలేజీలలో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నారు. మానసికంగా నలిగిపోతూ ఉరికొయ్యలకు వేలాడుతున్నారు. ఈ పాపం ఎవరిది?

చదువులా..చావులా!..అనేది అర్ధం కాని అయోమయ పరిస్థితులిప్పుడు అంతటా నెలకొంటున్నాయి. కార్పొరేట్ కళాశాలలు మరణవేదికలుగా మారుతుండడం చూసి అటు విద్యార్థి లోకం, తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఫీజలు, డబ్బులు, డొనేషన్లుగా విద్యావ్యాపారం మూడు పువ్వులారుకాయలుగా మారుతుండడం, మరోవైపు మార్కులు, ర్యాంకులే పరమార్ధంగా విద్యార్థుల్లో మానసిక వత్తిడి బలంగా పెరిగి, అవి బలవన్మరణాలుగా మారుతుండడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. దీంతో ఎంతోమంది సరస్వతీపుత్రులు నేలరాలిపోతున్నారు. కన్నవారికి కడుపుకోత మిగిల్చి తిరిగిరాని లోకాలకు వారు తరలిపోతూనేవున్నారు. చదువులు జ్ఞానానికి దీపాలుగా ఉండాల్సిన చోట..అవి గుదిబండలుగా మారుతుండడం వల్లనే ఈ దుస్థితి దాపురిస్తోందంటూ అనేకమంది ఆందోళన చెందుతున్నారు. అనేక విద్యాసంస్థలు, ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీల్లో ఇలాంటి వత్తిళ్ళతో ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడుతున్నాయని, చదువుకోవడానికి వెళ్లిన పిల్లలు శవాలై తిరిగివస్తుంటే కడుపు తరుక్కుపోతుందని తల్లిదండ్రులు హృదయవిదారకంగా రోదిస్తున్నారు. అయినా, ఎవరి గుండెలూ కరగవు. విద్యే వ్యాపారంగా మారిన చోట ఇలాంటివన్నీ సర్వసాధారణాలే. ప్రభుత్వాలూ రకరకాల కారణాలతో ఈ విద్యావ్యాపారాల వ్యవహారాలపై ఉదాసీనతనే ప్రకటిస్తాయి. తమ కాలేజీకి ర్యాంకులు వస్తే చాలు..కాలేజీ ప్రతిష్ట పెరుగుతుందని, తద్వారా విద్యావ్యాపారం మరింతగా పెరుగుతుందన్న కార్పొరేట్ కళాశాలల యావ అందరికీ తెలిసిందే. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలకు మంచి ర్యాంకులు వస్తే వారి భవిష్యత్తు బావుంటుందనే ఆశతో అనేక కష్టనష్టాలకోర్చి కార్పొరేట్ చదువులకు పంపుతున్నారే తప్ప మరోమార్గం ఆలోచించడం లేదు. మార్కులు-ర్యాంకులే ప్రాతిపదికగా నిత్యం పెరుగుతున్న ఆయా కళాశాలల వత్తిడి తట్టుకోలేక, మరోవైపు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చలేకపోతున్నామన్న బాధతో..పిల్లలు చివరికి ఆత్మహత్యలే శరణమనుకుంటున్నారు. పోటీ పరీక్షలు ఎంతో ఆనందంతో జరగాల్సింది పోయి అవి విద్యార్థులకు జీవితానికే అగ్నిపరీక్షలుగా మారుతుండడం ఎంత దయనీయం!..

## విపరీతమైన వత్తిడే కారణం :

మొన్నటికి మొన్న కడపలోని ఓ కార్పొరేట్ కాలేజ్‌లో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అదే క్యాంపస్‌లో ఇటీవలి కాలంలో ఇది మూడవ ఆత్మహత్య. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో ఇంటర్ చదువుతున్న మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయవాడ శివారుల్లోని మరో కార్పొరేట్ కాలేజీలో ఇటీవలే ఇంకో విద్యార్థి ఆత్మహత్య. ఇలా ఆత్మహత్యల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచాల్సిన కార్పొరేట్ కాలేజీలు బలవన్మరణాలను పెంచుతున్నాయి. మార్కుల పేరుతో, ర్యాంకుల పేరుతో వారిలో విపరీతమైన వత్తిడి తీసుకువస్తుండడంతో ఎంత కష్టపడి చదివినా మంచి మార్కులు రానప్పుడు అటు కాలేజీలో ఉండలేక, ఇటు తల్లిదండ్రుల వద్దకు వెళ్ళలేక.. మానసికంగా నలిగిపోతూ తామిక ఎందుకూ పనికిరామనే భావనతో, లోలోపలే కుంగుబాటుకు గురవుతున్నారని, వాటి పర్యవసానంగా వారు ఆత్మహత్యల దారి వెతుక్కుంటున్నారంటూ అనేకమంది తల్లిదండ్రులు ఎంతో ఆవేదన చెందుతున్నారు. చదువుతో పాటు టీనేజీ వయస్సులో మానసిక పరిపక్వత లేక అనేకానేక కోణాలు, కారణాలు కూడా ఈ బలవంతపు చావులకు ఉరితాళ్లు పేనుతున్నాయి. కార్పొరేట్ కాలేజీల్లో చదువులు ఇలా విపరీతమైన వత్తిడితో ఉంటే, హాస్టళ్ళలో ఆ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోంది. స్టడీ అవర్స్ మినహాయిస్తే వారికున్న సమయం చాలా తక్కువ. విశ్రాంతి అనేదే ఉండదు. ఎప్పుడూ చదువే. ర్యాంకులు-మార్కులు ఇవే వారికళ్ళ ముందు ఎప్పుడూ కనిపిస్తుంటాయి. ఈ వత్తిడితోనే అనేకమంది ఆత్మహత్యలకు గురవుతున్నారు. ఇటీవల రెండు తెలుగురాష్ట్రాల్లో కనీసం 30 మంది విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో బలవన్మరణాలకు పాల్పడ్డారని గణాంకాలు చెప్తున్నాయి. ఇంత దయనీయమైన స్థితి గతంలో ఎప్పుడూ లేదు.

## తల్లిదండ్రులూ.. ఆలోచించండి!

అనేకమంది తల్లిదండ్రులు కూడా కార్పొరేట్ చదువులు మాత్రమే చదువులనే భ్రమలో పడిపోతున్నారు. అనేక ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునేందుకు ఎన్నో మంచి అవకాశాలున్నా వాటిపై అపనమ్మకంతో పిల్లలను కార్పొరేట్‌లకే పంపుతున్నారు. కార్పొరేట్ కళాశాలల వారు చెప్పే మాయమాటలు నమ్మి, ఎంతెంతో డబ్బును చదువు కోసం వెచ్చిస్తున్నా సరైన మార్కులు రావడం లేదేమని అనేకమంది తల్లిదండ్రులు తమ పిల్లలపై కూడా తమవంతు వత్తిడి పెంచుతున్నారు. ఇదెంతవరకు సమంజసమో తల్లిదండ్రులు ఆలోచించుకోవాలి. ఇళ్ళకు వచ్చినా విద్యార్థులకు తల్లిదండ్రుల నుంచి కూడా ఇలాంటి వత్తిడులు తప్పడం లేదు. చివరికి నూటికి ఒక్క మార్కు తగ్గినా కాలేజీ వాళ్ళు, తల్లిదండ్రులు ఏమంటారోనని భయపడుతూ పిల్లలు భోరుమని ఏడ్చేస్తున్నారు. కళాశాల చదువే జీవితాన్ని శాసిస్తుందని, ఒక్కమార్కు తగ్గినా జీవితమే లేదని అన్నట్లుగా ఉండే మాటలతో పిల్లలు మరింతగా మానసికంగా నలిగిపోతున్నారు. గతంలో 60శాతం మార్కులు వస్తేనే ఫస్ట్‌క్లాస్ అంటూ ఎంతో సంబరపడిపోయే రోజులు పోయాయి. 35శాతం వస్తే చాలు.. పాస్'. ఇంతకన్నా ఆనందం ఇంకేమి కావాలీ?.. ఇలాంటి చదువులు చదివినవారే ఎంతో ఉన్నతమైనస్థానాలను చేరుకున్నారనే విషయం గుర్తుంచుకోవాలి. వత్తిడి లేకపోతే పిల్లలు చదవరు అన్నట్లుగా కఠినమైనమాటలతో చదివించడం మంచిపద్ధతి కాదు. పిల్లలు ఇష్టపడి కాక, నిజంగానే 'కష్టపడి' చదవాల్సిరావడం దయనీయం. ఇకనైనా కళాశాలలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు అందరూ కలసి ఈ పరిస్థితులను చక్కదిద్దుకోవాలి. విద్యార్థులకు మానసిక వత్తిడిని తగ్గించి వారు హాయిగా, సంతోషంగా చదువుకునే పరిస్థితులను కల్పించాలి. అందుకు ప్రభుత్వాలే తగు విధానాలను రూపొందించాలి. పోటీతత్వంతో కార్పొరేట్ విద్యాసంస్థలు అవలంబిస్తున్న విపరీత ధోరణులకు ప్రభుత్వమే చెక్ పెట్టాలి.




నరకుడు దుష్టుడై నరులను బాధింప
  నసుర ప్రవృత్తుల నమరియుండ
లోకకంటకుడని లోకములన్నియు
  వడకుచు నుండగా పుడమి జేరి
అసురుని నరకుని యాహవమందున
  సంహరించెను హరి సంతసమున
దుష్టుల శిక్షించి శిష్టుల రక్షింప
  హాయిగా లోకకళ్యాణ మమరె
పిన్న పెద్ద లనెడి భేదమ్ము లేకుండ
జరుపుకొనిరి జనులు సంబరముల
దీపకాంతు లెగయ దీపావళి యనంగ
పల్లె పట్టణముల పండుగయ్యె!...

- వనం సుబ్రహ్మణ్యం

రిటైర్డ్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, చిన్నపడుగుపాడు, 9441594897

# డిఆర్‌డిఏ పి.డి బదిలీ

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వున్న లావణ్యవేణి వెలగపూడిలోని సచివాలయానికి బదిలీ అయ్యారు. 2016 జూలై 7వ తేదీన ఆమె డిఆర్‌డిఏ పి.డిగా బాధ్యతలు చేపట్టారు. తన హయాంలో పొదుపు మహిళల ఋణ బకాయిలు 106 కోట్లుండగా, 68కోట్లు రికవరీ చేయగలిగారు. డిఆర్‌డిఏ కొత్త పి.డిగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

# ప్రజాస్వామ్యానికి పాతర!

(మొదటి పేజీ తరువాయి)

చేయగలం అన్న నాయకులకు ఒకటే ప్రశ్న! పుచ్చలపల్లి సుందరయ్య ఎప్పుడు అధికార పార్టీలో వున్నాడు? వాజ్‌పేయి, అద్వానీ వంటి అగ్రనేతలు దాదాపు నాలుగు దశాబ్దాలు ప్రతిపక్ష నేతలుగానే వున్నారు. అంతెందుకు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి 2004లో సీఎం అవడానికి ముందువరకు కూడా ఏ పార్టీ అధికారంలో వున్నా ప్రతిపక్ష నేత పాత్రనే పోషించాడు. అభివృద్ధి కోసం పార్టీలు మారుతున్నామని చెప్పుకుంటున్న నాయకులెవరు కూడా నియోజకవర్గ ప్రజల మీద ప్రేమతో పార్టీ మారడం లేదన్నది ప్రజలకు తెలిసిన నగ్నసత్యం. వాళ్ళు పార్టీ మారడానికి ప్రధాన కారణం ప్యాకేజీలే అన్నది అందరికీ తెలిసిన నిజం. మన కళ్ళ ముందు ఒక నేరం జరిగింది. నేరం చేసిన వాడే కాదు, చూస్తూ దానిని అడ్డుకోని వాళ్ళు, కోర్టులో చూసింది చూసినట్లు చెప్పని వాళ్ళు కూడా దోషులే! భారత రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, న్యాయమూర్తులు... మరి ఇంతమంది ముందు ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతూనే వుంది. ఒక పార్టీ నుండి గెలిచిన వాళ్ళను ప్రలోభాలతో ఇంకో పార్టీలో చేర్చుకునే కార్యక్రమం నిరాటంకంగా జరుగుతోంది. దీనిని అత్యాచారమనాలో... వ్యభిచారమనాలో... పేరు ఏదైనా ఇదొక రాజకీయ నేరమే. అది ఏ పార్టీ వాళ్ళు చేసినా నేరమే! మరి ఈ నేరాన్ని చూస్తూ కూడా అడ్డుకోలేని ఈ పెద్దలంతా దోషులే కదా!

ఒక పార్టీ టిక్కెట్ తెచ్చుకుని, ఆ పార్టీ గుర్తు మీద గెలిచి, ఆ పార్టీ అధికారంలోకి రాకపోతే అధికార పార్టీలోకి దూకే ప్రజాప్రతినిధులను గతంలో ఆయారామ్, గయారామ్‌లు అంటుండేవాళ్ళు. ఇప్పుడు పార్టీలు మార్చే వాళ్ళకు ఆ పేర్లు కూడా తక్కువేమోననిపిస్తోంది. రాజకీయాలలో ఏ మాత్రం విలువలు, వ్యక్తిగతంగా మనస్సాక్షి అన్నవి వుంటే ఇంకో పార్టీలోకి మారాలనుకున్నప్పుడు ఏ పార్టీ అభ్యర్థిగా అయితే పోటీ చేసి ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిచారో ఆ పదవులకు రాజీనామా చేసి వెళ్లాలి. రాజకీయాలలో అది విలువలకు నిదర్శనం. 2014 ఎన్నికల తర్వాత ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు తెలుగుదేశంలో చేరారు. వీరిలో ఏ ఒక్కరు కూడా విలువలకు కట్టుబడి తమ పదవులకు రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరలేదు. పదవులతో పాటే పార్టీ మారారు. ఇక వీళ్ళు ఎందుకు పార్టీ మారారు అనేందుకు చాలా కారణాలుంటాయి. ఒక్కరోజు కూడా అధికారం లేకుంటే ప్రజాప్రతినిధులు నిలబడలేని పరిస్థితులొచ్చాయంటే ఇక ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున పోరాడే నాయకులే వుండరు. ప్రజాస్వామ్యానికి ఈ పోకడలు చాలా ప్రమాదకరం. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలన్న ఆలోచనలు ఇంకా ప్రమాదకరం.

ఏ రాష్ట్రంలోనైనా ప్రతిపక్షాన్ని పనిగట్టుకుని నిర్వీర్యం చేయాల్సిన పని లేదు. ప్రభుత్వం సమర్ధవంతంగా పని చేస్తుంటే ప్రజలే ప్రభుత్వం వైపు నిలబడతారు. ఆటోమేటిగ్గా ఆ రాష్ట్రంలో ప్రతిపక్షం బలహీనపడుతుంది. పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిష్టులు పాతికేళ్లు పాలించారు. గుజరాత్‌లో బీజేపీ వరుసగా 4సార్లు అధికారంలోకి వచ్చింది. ఒరిస్సా, మధ్యప్రదేశ్, చత్తీష్‌గఢ్ సీఎంలు విజయాలలో హ్యాట్రిక్ సాధించారు. వీళ్లెవరూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్యాకేజీల ఆశ పెట్టి తమ పార్టీలోకి లాక్కోలేదు. కేవలం మంచి పరిపాలన ద్వారా ప్రజలను తమ వైపుకు తిప్పుకునే విజయాలు సాధించారు.

కాని, దేశ చరిత్రలోనే చంద్రబాబు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన పోకడలకు బాటలు వేసాడు. ప్రతిపక్ష ఎంపీలు, ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకోవడం ద్వారా రాష్ట్రంలో వార్‌ను వన్‌సైడ్ చేయాలనుకుంటున్నాడు. ఈ దేశ చరిత్రలోనే ప్రతిపక్షం నిర్వీర్యం కావడం అన్నది ఎక్కడా జరగలేదు. ఏ పార్టీ అయినా చరిత్ర గర్భంలో కలిసిపోవడం అన్నది ప్రజల చేతుల్లో పని. ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పంథాలో నడుస్తున్నప్పుడు ప్రజలే ప్రతిపక్షమయ్యి పిడికిలి బిగిస్తారు. అవతల చచ్చు, పుచ్చు పార్టీలున్నా అధికారంలో కూర్చోబెడతారు. మూడేళ్ల క్రితం జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలనే చూడండి... ఒక ప్రధాని, 20మంది కేంద్రమంత్రులు... పెద్ద ఎత్తున ప్రచారం... ఇన్ని చేసినా ఆమ్ ఆద్మీ చీపురు తుఫాన్‌లో బీజేపీ తుడిచిపెట్టుకు పోయింది. కాబట్టి నాయకులు పార్టీ మారి వచ్చినంత మాత్రాన ప్రతిపక్షం నిర్వీర్యం కాదు. ప్రజల అభిమానం పొందగలిగితే ప్రతిపక్షం దానంతట అదే బలహీన పడుతుంది.

# ఆ ఆరు జిల్లాల్లో... అగ్నిపరీక్షే

(మొదటి పేజీ తరువాయి)

బలంగా కృష్ణానదికి అవతల వైపు వున్న కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో లేకుండా పోయింది. విశాఖపట్నం లోక్‌సభలో వై.యస్. సతీమణి, జగన్ అమ్మగారైన వై.యస్.విజయమ్మే ఓడిపోయారు. కృష్ణానదికి ఇవతల వైపు రాజకీయ వాతావరణం వేరు, అవతలి వైపు వాతావరణం వేరు. ఈ ఆరు జిల్లాల్లోనూ కుల సమీకరణలు బాగా పని చేస్తాయి. 2014 ఎన్నికల్లో ఈ జిల్లాల్లో బలమైన కమ్మ, కాపు, క్షత్రియ సామాజిక వర్గాలన్నీ ఒక్కటయ్యాయి. పవన్ కళ్యాణ్ మద్దతు తెలపడం వల్ల తెలుగుదేశంకు కాపుల ఓట్లు బాగానే కలిసొచ్చాయి. సాంప్రదాయ బద్ధంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా జిల్లాల్లో 1983 నుండి కూడా తెలుగుదేశం బలంగానే వుంది. 2014లో ఆ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ఈ ఆరు జిల్లాలే!

ఈ ఆరు జిల్లాల్లో పార్టీని పటిష్ట పరిస్తేనే అధికారంపై ఆశలు నిలబడతాయి. దివంగత నేత వై.యస్. వున్నప్పుడు ఈ ఆరు జిల్లాల్లో తన సొంతంగా బలమైన కేడర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆయన మరణించాక ఆయన ఏర్పాటు చేసిన కేడర్ చెల్లాచెదురైంది. ఈ ఆరు జిల్లాల్లో కుల సమీకరణలు, నాయకుల సమీకరణపై జగన్ దృష్టి సారించాల్సి వుంది. గతంలో వై.యస్. వెన్నంటి నడిచిన వాళ్లను, ప్రస్తుతం కాంగ్రెస్‌లో వున్న సీనియర్లను తన పార్టీ వైపు తీసుకురావాలి. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఋణమాఫీ కూడా ఈ జిల్లాల్లోనే బలంగా పని చేసింది. ఋణమాఫీ వైఫల్యాలను కూడా జగన్ ఇక్కడ ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఈ ఆరు జిల్లాల్లో తెలుగుదేశం సాంప్రదాయ ఓటు బ్యాంకుకు గండి కొట్ట గలిగితేనే వైకాపాకు అవకాశాలుంటాయి.



# నీళ్ళు అందేనా? బీళ్ళు పండేనా?



*గత రెండేళ్ళుగా జిల్లాలో రెండో పంట అన్నదే లేకుండా గడిచిపోయింది. సకాలంలో వర్షాలు పడక, జిల్లాలో వున్న సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు నిండక రైతులు రెండో పంటపై ఆశలు వదులుకున్నారు. మొదటి పంటయినా, రెండో పంటయినా అధికారికంగా దాదాపు ఆరు లక్షల ఎకరాల్లో సాగవుతుంది. అనధికారికంగా అయితే ఇంకో రెండు లక్షల ఎకరాల దాకా చెప్పుకోవచ్చు.*

నెల్లూరుజిల్లా రైతాంగానికి సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లే ప్రాణాధారం. రెండు రిజర్వాయర్‌లలోనూ 140 టిఎంసీల నిల్వ సామర్థ్యం వుంది. తెలుగు గంగ ప్రాజెక్ట్‌లో ఈ రెండు రిజర్వాయర్‌లు భాగమైనప్పటి నుండి శ్రీశైలం నుండి కృష్ణ నీటినే మళ్లిస్తూ చెన్నై తాగునీటి అవసరాలకు తరలించడంతో పాటు ఈ జిల్లా రైతుల అవసరాలకు వాడుకుంటున్నాం. దివంగత నేత వై.యస్. హయాంలో పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచడం ద్వారా త్వరగా సోమశిల, కండ్లేరులను నింపే అవకాశం కల్పించారు. ఆరోజు ఆయన చూపించిన మార్గం జిల్లా రైతాంగానికి ఈరోజు ఎంతగానో ఉపయోగపడుతోంది.

గత ఏడాది రాష్ట్రంలో వర్షాలు లేవు. ఎగువ జిల్లాలు, ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షాలు లేక శ్రీశైలం ఎండిపోయింది. ఈ స్థితిలో సోమశిల, కండ్లేరులలో నీటి మట్టాలు అడుగంటిపోయాయి. ఈ ఏడాది మొదటి పంటకే అరకొరగా నీళ్ళిచ్చారు. రెండో పంట అసలు వేయలేదు. బోర్లు, బావుల క్రింద సాగు చేసుకోగలిగిన వాళ్ళు సాగు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌కు దాదాపు 6లక్షల ఎకరాల పొలాలను బీళ్ళుగా పెట్టేసారు.

అదృష్టం కలిసొచ్చి ఈసారి శ్రీశైలంకు నీళ్లొచ్చాయి. శ్రీశైలం ద్వారా సోమశిలకు 45 టిఎంసీలకు పైగానే చేరాయి. శ్రీశైలం నుండి ఇంకా నీటిని వదిలే అవకాశం ముంది. సోమశిల నిండుతుండడంతో రైతులు ఆనందంతో వున్నారు. నారు మళ్ళకు సిద్ధమవుతున్నారు. ఈసారైనా పూర్తిస్థాయిలో సాగుకు నీళ్లివ్వాలని కోరుతున్నారు. రేపు ఐఏబి సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# ప్రజాదీవెన కోసం వస్తున్నా!

## - ఎమ్మెల్యే అనిల్



నెల్లూరు నగర ప్రజల ఆశీస్సుల కోసం ఈ నెల 26వ తేదీ నుండి ప్రజా దీవెన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈనెల 17వతేదీన నెల్లూరులోని ఎం.సి.ఎస్ కళ్యాణ మండపంలో వైయస్సార్ కుటుంబం ముగింపు సభ మరియు నియోజకవర్గ వైసిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ మాట్లాడుతూ సెప్టెంబర్ 21వ తేదీన చేపట్టాల్సిన ప్రజాదీవెన కార్యక్రమాన్ని 'వై.యస్.ఆర్ కుటుంబం' కార్యక్రమం కారణంగా ఈనెల 26కు వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రజాదీవెనలో నగరంలోని ప్రతి ఇంటికొస్తానని, ప్రతి ఒక్కరి సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. జగనన్న చెప్పిన నవరత్నాలను ప్రజలకు వివరిస్తామని, ప్రజల దీవెనలతో జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామని అన్నారు. నెల్లూరు నగరంలో 'వైయస్ఆర్ కుటుంబం' ఎంతో విజయవంతమైందని, 40వేల కుటుంబాలు పార్టీకి చేరువయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఎం.ద్వారకానాథ్, కార్పొరేషన్ వైసిపి ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో

# ఉచిత హెల్మెట్‌ల పంపిణీ





ప్రపంచ హెల్మెట్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీన నారాయణ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమం నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగింది. జిల్లా రవాణా శాఖ, పోలీసు యంత్రాంగం సహకారంతో పాత్రికేయులకు, గ్రామీణ వైద్యులకు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు, ట్రాఫిక్ హోంగార్డ్స్‌కు ఉచితంగా హెల్మెట్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్‌శాఖా మంత్రి ఓయన్‌డి పెంచలరెడ్డి పాల్గొని మాట్లాడుతూ హెల్మెట్స్‌ను ఉచితంగా పంపిణీ చేయడం రాష్ట్రంలోనే తొలిసారని, ఇదే స్ఫూర్తితో మరింతమంది ముందుకు వచ్చి హెల్మెట్లు పంపిణీ చేయాలని, ఒక గొప్ప ఆలోచనకు శ్రీకారం చుట్టిన నారాయణ హాస్పిటల్స్ న్యూరోసర్జన్ డా॥ జి.విద్యాసాగర్ అభినందనీయుడని కొనియాడారు. ట్రాఫిక్ సేఫ్టీ డిఎస్‌పి సుధాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వాడకం యొక్క ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామ్ ప్రసాద్, నారాయణ హాస్పిటల్స్ సిఇఓ విజయమోహన్‌రెడ్డి, ఏజిఎం సిహెచ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోలీసు శాఖలో...

# ప్రక్షాళనకు శ్రీకారం



పోలీసుశాఖ అన్నది తులసి వనంగా వుండాలి. పది మందికి మంచి చేసేదిగా వుండాలి. ఇలాంటి వనంలోనే గంజాయి మొక్కలు కూడా పెరిగితే... సమాజానికి మంచికంటే చెడే ఎక్కువగా జరుగుతుంది. జిల్లాలో పాతుకుపోయి వున్న బెట్టింగ్, ఎర్రచందనం మాఫియాల ఆట కట్టిస్తూ, ఇంతకాలం వీటికి అండగా నిలిచిన తన శాఖ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకున్న జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, తాజాగా తన శాఖలో పూర్తి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. మొన్నటికి మొన్న తన సి.సి.తో సహా ఏఎస్పీ, డిఎస్పీ, సి.ఐలతో కలిపి మొత్తం 42మంది మినిస్టీరియల్ సిబ్బందిని బదిలీ చేసి సంచలనానికి తెరలేపిన ఎస్పీ రామకృష్ణ, ఇది జరిగి 24గంటలు కూడా గడవక ముందే 16వ తేదీ నలుగురు ఎస్.ఐలతో సహా ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులతో కలిపి 50 మందికిపైగా సిబ్బందిని విఆర్‌కు ఆదేశించారు. విఆర్‌కు బదిలీ చేసినవాళ్ళపై వివిధ అవినీతి ఆరోపణలున్నాయి. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడాలంటే ముందు పోలీసు శాఖ సమర్థవంతంగా, నిజాయితీగా పనిచేసేలా ఉండాలని భావించిన ఎస్పీ ఆ దిశగా ప్రక్షాళన మొదలు పెట్టారు. ఎస్పీ చర్యలతో పోలీసు శాఖలో ప్రకంపనలు మొదలయ్యాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ప్రజల ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

## - సంఘీభావం తెలిపిన ఆనం విజయ

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమం ఈ నెల 17వ తేదీన ములుమూడి గ్రామంలో జరిగింది. వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయ కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమానికి విచ్చేసి 105 రోజుల ప్రజాబాట కార్యక్రమం చేపట్టిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆనం విజయ మాట్లాడుతూ పిలిస్తే పలికే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని, రాబోయే ఎన్నికల్లోనూ ఆయనను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. ఆయన చేపట్టిన ప్రజాబాట కార్యక్రమం ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు.



**విద్యార్థులతో కలిసి భోజనం:**

మన ఎమ్మెల్యే మన ఇంటికి కార్యక్రమంలో భాగంగా సౌత్‌మోపూరులో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, అక్కడి సాంఘిక సంక్షేమ వసతి గృహంకు వెళ్లారు. విద్యార్థులతో కలివిడిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బి.సి విద్యార్థులతో కలిసి భోజనం చేసారు.







Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com